ప్రజాశక్తి
సోమవారం 14 జులై 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

ముందుకు సాగని 'ఖరీఫ్'

వర్షం కోసం రైతుల ఎదురు చూపు

ప్రజాశక్తి- పిసిపల్లి

ఖరీఫ్ సీజన్‌లో సాగు ముందుకు సాగలేదు. రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు ఖరీఫ్ సీజన్. ఈ సీజన్‌లో మండలంలో సుమారు పన్నెండు వేల ఎకరాల్లో కంది సాగు చేస్తారు. వరి నామమాత్రంగా సాగు చేస్తారు. గతంలో వరి సాగు 500 ఎకరాలలోపే ఉంది. అది కూడా ముమ్మరంగా వర్షాలు పడిన తర్వాత అక్టోబర్ నవంబర్ సాగు చేస్తుంటారు. ఖరీఫ్ సీజన్‌లో కంది ఎక్కువగా సాగు చేస్తారు. ఏరువాక పౌర్ణమి రోజు సాగు చేస్తారు. ఈ ఏడాది ఏరువాక పౌర్ణమి వచ్చినప్పటికీ మండల మొత్తం మీద 1000 ఎకరాల్లో కూడా సాగు చేయలేదు. కారణం వర్షాలు లేకపోవడమే. గతంలో జూన్ నెలలో చివరిలో వర్షాలు పడడంతో జులై మొదటి నుంచి పంట సాగు చేసేవారు. ఇప్పటికీ కొన్ని ప్రాంతాలలో వర్షాలు కురవలేదు. వేసవి కాలాన్ని తలపించేలా ఎండలు ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై ఒకటిన్నర నెల అయినప్పటికీ సాగు మాత్రం నామమాత్రంగానే ఉంది. ఇప్పటికీ కొన్ని ప్రాంతాలలో వానలు కురవలేదు. రాత్రి సమయంలో అప్పుడప్పుడూ వర్షం తుప్పర పడుతున్నాయి. తెల్లవారే సరికి భూమి మీద తేమ లేకుండా ఉంటుంది. పగలు ఎండకు రాత్రులు కురిసిన వర్షం ప్రభావం పెద్దగా కనిపించడం లేదు.

వర్షాలు లేక బీడుగా మారి భూమి

పింఛన్లు, ఇళ్లస్థలాలు.. స్థానిక సమస్యలు

- సుపరిపాలనలో తొలిఅడుగులో

జనం నుంచి వస్తున్న సమస్యలు

- గ్రామాల్లో ఎమ్మెల్యేలకు

ఎక్కువగా అభ్యర్థనలు ఇవే..

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

పింఛన్లు ఎప్పుడు ఇస్తారు? గతంలో ఇచ్చిన ఇళ్లస్థలాల్లో ఇళ్ల కట్టుకోలేదు. బిల్లులు రాలేదు. ఇళ్ల కావాలి.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలన తొలిఅడుగులో ఎమ్మెల్యేల వద్దకు వస్తోన్న జనం నుంచి వస్తోన్న అభ్యర్థనలు ఇవే. ఈనెల 2 నుంచి ఎమ్మెల్యేలు ఇంటింటికీ తిరుగుతున్నారు. గ్రామాల్లో ఏడాది పాలనపై వివరించే కార్యక్రమం ప్రారంభమైంది. గ్రామాల్లో,వార్డుల్లో జనం తమ వద్దకు వస్తోన్న ఎమ్మెల్యేల వద్ద సమస్యలు మొరపెట్టుకుంటున్నారు. కొత్తగా ఇప్పటికీ పింఛన్లు ఇవ్వలేదు. వాటిపై అడుగుతున్నారు. ఈపాటికే పింఛను పొందే వ్యక్తి చనిపోతే కుటుంబంలో ఒకరికి వచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొత్త పింఛన్లపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. వీటికోసం ఇపుడు వృద్దులు, వితంతువులు, వికలాంగులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే ఆన్‌లైనులో ధరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఇంకా ఆదేశాలు రాలేదు. ప్రతి గ్రామంలోనూ పింఛన్ల కోసం కనీసం పది మందికి తగ్గకుండా లబ్ధిదారులున్నారు. ఇక ఇళ్లస్థలాలపైనా ఎక్కువగా విజ్ఞప్తులు వస్తున్నాయి. గతంలో ఇచ్చిన స్థలాల్లో 30 శాతం కూడా ఇళ్ల కట్టుకోలేదు. కొందరికి బిల్లులు ఆగిపోయాయి. మధ్యలోనే ఆగిపోయిన కాలనీలు వేలల్లో ఉన్నాయి.వాటిపైనా అడుగుతున్నారు.ఎమ్మెల్యేలకు వీటిపై ఏమి సమాధానం చెప్పాలో స్పష్టతలేదు. కొత్తగా ఇళ్ల కూడా అడుగుతున్నారు. వాటిని త్వరలోనే మంజూరు చేస్తామని చెబుతున్నారు. ఒంగోలు పట్టణంలో ఇళ్లస్థలాలపై ఏ నిర్ణయం తీసుకోలేదు. టిడ్కో ఇళ్లను అలాగే పెట్టారు. ఇవన్నీ ఇపుడు ఎమ్మెల్యేల వద్ద ప్రస్తావనకు వస్తున్నాయి. గ్రామాల్లో రోడ్లు, డ్రైన్లు, కరెంటు సమస్యలు, వ్యక్తిగత సాయాలు వస్తున్నాయి. భూముల సమస్యలు, గ్రామాల్లో ఏళ్లతరబడి పెండింగు సమస్యలు వస్తున్నాయి. మంత్రులు అధికారులకు ఆదేశాలు ఇస్తున్నారు. మంత్రులు వెళ్లే గ్రామాల్లోనూ పెద్దఎత్తున సమస్యలు అర్జీల రూపంలో వస్తున్నాయి. అయితే ఏదో ఒక అభివృద్ధి పనుల తాలూకు కార్యక్రమాలు పెట్టుకుని వెళ తున్నారు. విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రవి కుమార్ సబ్‌స్టేషన్లకు శంకుస్థాపనలు చేస్తున్నారు. సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీవీరాంజనేయస్వామి హస్తల్ల తనిఖీలు

2లో

బాల్యానికి 'మూడుముళ్లు'

- పుత్తడి బొమ్మకు పుస్తెల దండన
- బడికెళ్లాల్సిన వయస్సులో

కుటుంబ బాధ్యత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

బాల్య వివాహాలు బాలికల భవితకు శాపంగా మారుతున్నాయి. చిన్నారి పెళ్లి కూతురికి పుస్తెల దండ తప్పడం లేదు. బడికెళ్లాల్సిన వయసులో పెళ్లి పీటలెక్కుతున్నారు. పుస్తకాలు పట్టాల్సిన బాలికలు పుస్తెల దండతో అత్తారింటికి వెళుతున్నారు. పట్టుమని 15 ఏళ్లు నిండకుండానే భార్యగా, తల్లిగా బాధ్యతలు మోస్తున్నారు. పేదరికంతో ఆడపిల్ల భారం తీరుతుందని కన్నవాళ్లే సంసారం అనే సాగరంలోకి బాలికలను నెడుతున్నారు. 18 ఏళ్ల నిండకుండా వివాహాలు చేస్తే అనారోగ్యం పాలవుతారని వైద్యులు హెచ్చరిస్తున్నా వారు పెడచెవిన పెడుతున్నారు.

బాల్యం ఓ తీపి జ్ఞాపకం..

బాల్యం అంటే జీవితంలో ఓ తీపి జ్ఞాపకం. బాల్య వివాహాలు చిన్నారుల్లో చిచ్చు పెడుతున్నాయి. అవగాహన రాహిత్యమో..లేక భారం దించుకోవాలనే ఆత్రుతో..ఏది ఏమైనా తల్లిదండ్రులే యుక్త వయసుకు రాని ఆడపిల్లలకు పెళ్లి చేసి సమస్యల వలయంలోకి నెట్టి వేస్తున్నారు. ఎంతగా సాంకేతికత పెరిగినా బాల్య వివాహాలు మాత్రం ఆగడం లేదు.

ఏటా పెరుగుతున్న వైనం

జిల్లాలోని 38 మండలాల్లో కలిపి 2023-24వ సంవత్సరంలో 73, ఈ ఏడాది ఇప్పటి వరకు 33 బాల్య వివాహాలను జిల్లా శిశు సంక్షేమశాఖ, పోలీస్, రెవెన్యూ, చైల్డ్‌లైన్ (1098), హెల్ప్ ప్రాజెక్టు సంయుక్తంగా అడ్డుకున్నారు. మార్కాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో తరచూ బాల్య వివాహాలు జరుగుతున్నాయి. ఇటీవల వై.కొత్తపల్లి గ్రామంలో బాల్య వివాహానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిసి తహశీల్దారు మంజునాథరెడ్డి ఆ గ్రామాన్ని సందర్శించారు. తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహం జరుగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అదే గ్రామంలో మరో బాలికకు వివాహానికి ఏర్పాట్లు

జరుగుతున్నాయని తెలిసి వారికి కూడా చైతన్య కలిగించారు. వివాహం జరగకుండా చర్యలు తీసుకున్నారు. ఆ బాలిక చదువుకుంటానని తెలిపింది. తల్లిదండ్రులు ఆర్థిక స్థోమత లేదన్నారు. దీంతో సార్డ్ స్వచ్ఛంధ సంస్థ ఎపిఎం మందా మరియబాబు ద్వారా ఆ బాలిక నర్సింగ్ చదివేందుకు అవసరమైన ఫీజులు కట్టించారు. బాలికను ఒకేషనల్ నర్సింగ్ కళాశాలలో చేర్పించారు.

చైతన్యం అవసరం..

ప్రభుత్వం బాల్య వివాహాలు అరికట్టేందుకు అనేక చర్యలు తీసుకుంటుంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం దీనిపై అంతగా చైతన్యం ఉండడం లేదు. అధికారులు గ్రామ స్థాయిలో బాల్య వివాహాలు చేయడంతో ఎలాంటి చట్టాలు అమలు చేస్తారు..చేయడం వల్ల కలిగే అనర్థాలపై పశ్చిమ ప్రాంతంలో అంతగా అవగాహన చర్యలు చేపట్టడం లేదనే విమర్శ ఉంది. దీనివల్ల తరచూ బాల్య వివాహాలు చోటు చేసుకుంటున్నాయి.

ఫిర్యాదు ఎలా చేయాలంటే..

బాల్య వివాహాలు నిషేధిస్తూ చట్టం అమలులో ఉంది. దీనిని ఉల్లంఘించి బాల్య వివాహాలు చేస్తున్నట్లు గుర్తిస్తే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయొచ్చు. లేదా కలెక్టర్, ఆర్డీవో, తహశీల్దార్, సీడీపీవో, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఫిర్యాదు చేయవచ్చు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతారు.

2లో

ఊరిస్తున్న ఆక్వా పార్కు

- టెండర్లకే పరిమితమైన వైనం -మూడేళ్లుగా ముందుకు సాగని పనులు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ఆక్వా రంగ అభివృద్ధిలో భాగంగా ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి రూ.189 కోట్ల అంచనా లతో ఆక్వా పార్క్‌ను మంజూరు చేసింది. మొదటి విడతగా రూ.84 కోట్లు విడుదల చేసింది. రాష్ట్రప్రభుత్వం తన వాటాగా 40 శాతం నిధులను కేటాయించాల్సి ఉంది. ఈ పార్క్‌ను బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం దిండి వద్ద 292 ఎకరాల్లో నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. 2023 మేలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ నిజాంపట్నం వచ్చిన సందర్భంగా ఆక్వాపార్క్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే స్థల సేకరణలో జాప్యం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వ వాటా ధనం విడుదల కాలేదు. ఆక్వాపార్క్ నిర్మాణం అంశాన్ని పూర్తిగా పక్కన పెట్టారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అధికారులు ఆక్వా పార్క్‌పై దృష్టి పెట్టారు.స్థల సేకరణ పూర్తి చేశారు. నిధుల లభ్యత లేని కారణంగా పార్క్ నిర్మాణ వ్యయాన్ని రూ .88 కోట్లకు కుదించారు.192 ఎకరాల్లో పార్క్ నిర్మాణం కోసం కసరత్తు చేశారు. కేంద్రం నుంచి నిధులు కూడా విడుదల అయ్యాయని, తర్వలోనే పనులు ప్రారంభిస్తామని చెబుతూ వచ్చారు. ఏడాదిగా జిల్లా ప్రజలను ఆక్వాపార్క్ ఊరిస్తుందే తప్ప పనులు చేపట్టే పరిస్థితి లేదు. నిధుల లోటు కారణంగా జిల్లాకు వచ్చిన ప్రాజెక్టులు నిలిచిపోతున్నట్లు తెలుస్తోంది.192 ఎకరాల్లో ఆక్వా పార్క్ ఏర్పాటు చేయడం ద్వారా పీతలు, పండుగప్పలు, రొయ్యల హేచరీలు, సముద్ర ఆహార ఉత్పత్తుల ప్రాసెసింగ్ కేంద్రం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నిర్మించడం ద్వారా జిల్లా వాసులకు ఉపాధి లభిస్తుంది. దేశంలోనే అత్యాధునిక పరిజ్ఞానంతో రూపొందించే మొదటి ప్రాజెక్టుగా ప్రాచుర్యం పొందిన ఆక్వా పార్క్ ద్వారా సముద్రంలోనే దొరికే సీడ్స్ ఇక్కడే ఉత్పత్తి చేస్తారు. రాష్ట్రంలోని ఆక్వా రైతులు ఎప్పటి నుంచో వనామి రొయ్యల సేద్యం చేస్తున్నారు.రానున్న కాలంలో వనామికి ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా ఇతర చేపలు, రొయ్యలు ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు రూపొందించారు. పండుగప్ప

.ఆక్వా పార్కు ప్రతిపాదిత స్థలం (ఫైల్)

2లో

పింఛన్లు, ఇళ్లస్థలాలు..స్థానిక సమస్యలు

(మొదటిపేజీ తరువాయి)

ఈపాటికే పూర్తిచేసిన పనులను ప్రారంభించే కార్యక్రమాలను జోడించి ఇంటింటికీ తిరుగుతున్నారు. ఎమ్మెల్యేలకు పెద్దఎత్తున వినతులు వస్తున్నాయి. వీటి పరిష్కారం ఏమిటన్నది ఇపుడు ప్రశ్నార్థకంగా మారింది. పింఛన్లపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఇంటి స్థలాలు, ఇళ్లపైనా స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ఎందుకంటే గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు అని ప్రకటించారు. దీంతో గతంలో సెంటున్నర, సెంటు స్థలం పొంది ఇల్లు మొదలు పెట్టుకోని లబ్ధిదారులందరూ కొత్తగా ఇస్తే స్థలం పెరుగుతుందని ఆశపడుతున్నారు. వీటిపైనా తుది నిర్ణయంతీసుకోవాల్సిఉంది. ఇక ఏడాదిలో చేపట్టిన కార్యక్రమాలను కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఎమ్మెల్యేలు వార్డుల్లో జనానికి కరపత్రం ఇచ్చి ఫొటోలు దిగుతున్నారు.వాటి గురించి చెబుతూ ఇంకా ఏమిటి మీ సమస్యలు అని అడుగుతున్నారు. వృద్ధులతోనే ఎక్కువ సేపు మాట్లాడుతున్నారు. ఎందుకంటే పింఛను కూటమి ప్రభుత్వం రాగానే పెంచారు. అది ఏ మేరకు సానుకూలంగా ఉందో తెలుసుకునే యత్నం చేస్తున్నారు.తల్లికి వందన అమలు చేసినందున తల్లులు, విద్యార్థులతోనూ ఆత్మీయ సమ్మేళనాలు పెట్టారు. పాఠశాలల్లో పెద్దఎత్తున కార్యక్రమాలు చేపట్టారు. ఇంకా కొన్ని హామీలు అమలు చేయాల్సి ఉన్నందున త్వరలో వాటిని కూడా చేస్తామని చెబుతున్నారు. ఏదేమైనా పేదలు సంక్షేమపథకాల కోసం ఎదురు చూస్తున్నారు.ప్రభుత్వం కొన్ని నిర్ణయాలు తీసుకుంటే తప్ప ఇక్కడ అర్జీలకు పరిష్కారం దొరకదు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ సమస్యలపై ఓ అవగాహనకు వస్తున్నారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన సాయాలపై కొత్తగా నిర్ణయాలు అనివార్యం.

ఊరిస్తున్న ఆక్వా పార్కు

(మొదటిపేజీ తరువాయి)

అరుదైన జాతి పీతల పెంపకం, వివిధ రకాల జాతుల మత్స్య సంపద ఉత్పత్తులు, ఎగుమతులకు కేంద్రంగా ఆక్వా పార్క్ నిర్మాణం జరగాల్సి ఉంది. అదే విధంగా సముద్రంలో లభించే అరుదైన రంగు చేపలను అలంకరణల కోసం ఉత్పత్తి చేసే ప్రక్రియ ఈ పార్క్‌లో జరగనుంది. జిల్లాలోని బాపట్ల,చీరాల, వేటపాలెం, చినగంజాం,నిజాంపట్నం,రేపల్లె, నగరం తదితర ప్రాంతాల్లో దాదాపు 25 వేల ఎకరాల్లో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. వనామి రకం సాగు అధికంగా ఉంది. స్థానికంగా వనామి, టైగర్ రొయ్యలు,పీతలు, పండుగప్పల సీడ్‌ను రైతులు తమిళనాడు, పుదుచ్చేరిలకు వెళ్ళి తెచ్చుకుంటున్నారు. దీంతో రవాణా వ్యయం పెరిగి రైతులకు అధిక భారం పడుతుంది. రొయ్యలు, చేపలు ,పీతల పంట చేతికి వచ్చాక రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేసి ఇక్కడ నుంచి చెన్నై, కృష్ణపట్నం, కాకినాడ తదితర ప్రాంతాలకు తీసుకెళ్ళి అక్కడ ప్రాసెసింగ్ చేసి ఎగుమతులు చేస్తున్నారు. జిల్లాలోని దిండి ప్రాంతంలో ఆక్వా పార్కు ఏర్పాటు ద్వారా స్థానికంగా సీడ్ దొరకడంతో పాటు, ప్రాసెసింగ్ యూనిట్లు అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నారు. రైతులకు కూడా తక్కువ ధరలు సీడ్ లభిస్తుంది. రైతులకు ఖర్చులు తగ్గుతాయి. పార్కు ఏర్పాటుతో జిల్లాలో ఆక్వా సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో మూడేళ్ళుగా ఆక్వా రైతులను ఊరిస్తున్న ఆక్వా పార్కు నిర్మాణం పనులను త్వరితంగా చేపట్టి పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. నిజాంపట్నం సమీపంలోని దిండి గ్రామం వద్ద సముద్రం ఒంపుగా ఉన్న నేపథ్యంలో ఇక్కడ సముద్ర జలాలు వెనుక్కు వెళ్ళిన కారణంగా వందల ఎకరాల భూములు బయటపడ్డాయి. ఈ భూముల్లోనే ఆక్వా పార్కు కోసం భూసేకరణ చేపట్టారు.ఇప్పటికే అక్కడ మడ అడవులు విస్తరించిన క్రమంలో 50 ఎకరాలలో మడ భూములు అలాగే ఉంచుతారు. మరో 50 ఎకరాలు టూరిజం కోసం కేటాయించారు.

తారు రోడ్డును నిర్మిస్తున్న దృశ్యం

కర్రోలకు తారు రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-పెద్దారవీడు: మండలంలోని కర్రోల గ్రామానికి చాలా కాలం తరువాత తారు రోడ్డు మంజూరైంది. రూ.60 లక్షల వ్యయంతో నిర్మించే ఈ తారు రోడ్డు నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. చాలా కాలంగా మట్టి రోడ్డులో ప్రయాణంతో అక్కడి ప్రజలు నరకం అనుభవించారు. కర్రోల నుంచి కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి వరకు తారురోడ్డు నిర్మాణం పూర్తయితే అక్కడి ప్రజలకు ఇక్కట్లు తప్పనున్నాయి.

పర్యావరణ పరిరక్షణ కోసం ఉద్యమం

ప్రజాశక్తి-మార్కాపురం

'చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్' (సిఐఓ) దేశవ్యాప్తంగా ఒక ప్రత్యేక పర్యావరణ ఉద్యమాన్ని ప్రారంభించింది. 'మట్టిలో చేతులు-హృదయంలో దేశం' నినాదంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. గత జూన్ 25 నుంచి జూలై 26 వరకు చైతన్యం నింపేందుకు అవగాహన ప్రదర్శనలు జరుగుతున్నాయి. దేశ వ్యాప్తంగా 10 లక్షల మంది పిల్లలతో 10 లక్షల మొక్కలు నాటిం చడం, వాటిని సంరక్షించడమే లక్ష్యంగా కార్యక్రమం కొనసాగుతోంది. మార్కాపురం పట్టణంలోని చిన్న మసీదు ప్రాంగణం నుంచి కోర్టు సెంటర్, మెయిన్ బజార్ వరకు 'సేవ్ ట్రీ- సేవ్ ఎర్త్' వంటి నినాదాలతో ఆదివారం చిన్నారులతో ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమానికి జమాఅతె ఇస్లామీ హింద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు తబస్సుమ్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇస్లామిక్ విలువల ఆధారంగా పిల్లల సమగ్ర వికాసాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ప్రకృతి పట్ల ప్రేమ, బాధ్యత వంటి విలువలు బాల్యంలోనే అలవర్చుకోవాలని చిన్నారులతో చేపట్టామని వివరించారు. ఇలాంటి కార్యక్రమం ద్వారా పర్యావరణ భద్రత, సేవా భావం పెరుగుతుందని అన్నారు. మొక్క నాటడం పిల్లలకు జీవితాంతం బాధ్యత, ప్రేమ, సహనతను నేర్పే ఒక గొప్ప పాఠమవు తుందన్నారు. ఈ పర్యావరణ ఉద్యమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పిల్లలు తమ పాఠశాలలు, మదర్సాలు, మసీదులు, పార్కులు, ఇంటి సమీపంలో మొక్కలు నాటుతారని తెలిపారు. ప్రతి చిన్నారి తన చెట్టుకు ఒక పేరు పెట్టి, దానిని స్నేహితుడిగా, స్నేహితురాలిగా సంరక్షించేందుకు ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. పర్యావరణం పరిరక్షించేందుకు ప్రభుత్వ విభాగాలతో కలిసి పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐఓ పట్టణ అధ్యక్షురాలు తస్లీమా, జిఐఓ పట్టణ అధ్యక్షురాలు సుమయా, జమాఅతె ఇస్లామి హింద్ పట్టణ అధ్యక్షురాలు షాహెదా, పఠాన్ ఆయెషా, షేక్ ఆయెషా, మాలిన్, సర్తాజ్, చిన్నారులు పాల్గొన్నారు.

ప్రదర్శనలో చిన్నారులు

వాడవాడలా బీసీ జెండా ఎగరాలి

బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు

ప్రజాశక్తి-మార్కాపురం

వాడవాడలా బిసి కమిటీల ఏర్పాటు, ఆ తరువాత బిసి జెండాలు ఎగరేయాలని బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. బీసీ సంక్షేమ సంఘం పటిష్టతకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిసి వర్గంలోని 139 కులాల ప్రజలందరి అవసరాలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు బిసిలు ఐక్యం కావాలన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు బిసిల హక్కుల సాధనకు-రాజ్యాంగబద్ధ రక్షణ కోసం పోరాడుతూనే ఉన్నామన్నారు. విద్యార్థుల వసతి గృహాల సమస్య నుంచి జాతీయ స్థాయిలో జనగణనతో పాటే కులగణన చేయాలని సమరశీల పోరాటాలు నిర్వహించినట్లు చెప్పారు. ఎన్నో విజయాలు ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం సాధించిందన్నారు. మార్కాపురం నియోజకవర్గ స్థాయిలో కూడా ఉద్యమ కార్యాచరణను రూపొందించుకోవాలన్నారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ గతంలో మార్కాపురం నియోజకవర్గంతో పాటు ప్రకాశం జిల్లా మొత్తం బిసి ఉద్యమాలకు పట్టుగొమ్మగా ఉందన్నారు. అంతకు ముందు మార్కాపురం నియోజకవర్గ బిసి సంఘం అధ్యక్షులుగా బండారు రాజేష్‌కు నియామక పత్రం అందించారు. అనంతరం బిసి సంఘ నేతలంతా పోరాటాలకు సిద్ధమని సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బలగాని ఆంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, మార్కాపురం నియోజకవర్గ గౌరవాధ్యక్షులు దూదేకుల మస్తానయ్య, ఉపాధ్యక్షులుగా పి మహేష్, ప్రధాన కార్యదర్శి డి శంకర్, కోశాధికారి శివకృష్ణ, యువజన విభాగ కార్యదర్శి వి శ్రీనివాస్, మహిళా విభాగ కార్యదర్శి గీతా భవాని, కార్యవర్గ సభ్యురాలు వై కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీ నేతల అభివాదం

బాల్యానికి 'మూడుముళ్లు'

(మొదటిపేజీ తరువాయి)

బాల్య వివాహం చేస్తే రెండేళ్లు జైలు

బాల్య వివాహం చేసినా, ప్రోత్సహించినా రెండేళ్ల వరకూ జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా ఉంటుంది. బాల్య వివాహాల నిర్మూలన, బాలల సంరక్షణ కోసం 1098 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంది. సమాచారం అందిస్తే సంబంధిత అధికారులు ఆ వివాహాన్ని అడ్డుకుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు 18 ఏళ్లు నిండే వరకు బాలికకు వివాహం చేయబోమని ఒప్పంద పత్రం రాయించుకుంటారు.

సమాచారం అందించాలి

పి చౌదయ్య, ఎస్ఐ, యర్రగొండపాలెం

ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్టు తెలిస్తే సమాచారం అందించాలి. పోలీసు, రెవెన్యూ, చైల్డ్‌లైన్ 1098 ద్వారా వాటిని అడ్డుకుంటాం. బాల్య వివాహాల కారణంగా జరిగే నష్టాలను వివరిస్తున్నాం. బాలికల ఆరోగ్యం, వారి భవిష్యత్తుపై తెలియజేస్తున్నాం. చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలను తెలియజేసి కౌన్సిలింగ్ ఇస్తాం.

అంగన్‌వాడీల ద్వారా చైతన్యం

ఎం పద్మావతి, సీడీపీవో, యర్రగొండపాలెం

బాల్య వివాహాలు జరగకుండా ఉండేందుకు గ్రామాల్లో అవగాహన సభలు ఏర్పాటు చేస్తున్నాం. వివిధ శాఖలు, ప్రజలతో కమిటీలు వేసి వీటిని నియంత్రించే ఏర్పాటు చేస్తున్నాం. తల్లిదండ్రులు బాల్య వివాహాలపై ఆలోచించి అవగాహన పెంచుకోవాలి. వారి పిల్లలను చక్కగా చదివించుకోవాలి. క్షేత్రస్థాయిలో బాల్య వివాహాల నిర్మూలనపై అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలిచ్చాం.

అందరూ బాధ్యులే

పి దినేష్ కుమార్, జిల్లా బాలల సంరక్షణ అధికారి, ఒంగోలు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం. బాల్య వివాహం జరిపించిన తల్లిదండ్రులు, సంరక్షకురాలు, అనుమతించిన పెద్దలు, పెళ్లికి సహకరించిన వారు కూడా నేరస్తులే అవుతారు. బాలికను పెళ్లి చేసుకుని సంసారం చేస్తే పోక్సో కేసు నమోదవుతుంది. అన్ని కోణాల్లో బాల్య వివాహాలు నిరోధించడానికి శ్రమిస్తున్నాం.

మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. 40/2024

తాతా చాణుక్య ఉమామహేష్ ...వాది
వర్సెస్
ఐతా సరస్వతి ...ప్రతివాది

టు,
ఐతా సరస్వతి, భర్త: కిశోర్, వయసు: 48 సం॥లు, నివాసం: బేస్తవారిపేట గ్రామం, బేస్తవారిపేట మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాను, వాది ప్రతివాదిపై స్పెసిఫిక్ పెర్ఫార్మెన్స్ దావా పై కోర్టులో వేయగా, నీకు కోర్టు సమన్లు ముట్టని కారణంగా పేపరు ప్రకటన కొరకు ఉత్తర్వులు జారీ చేసినారు. కావున నీవు స్వయముగా లేదా వకీలు ద్వారా కానీ తేదీ: 24-07-2025 ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీపరోక్షమందు కేసు తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వులతో)
వాయిదా:24-07-2025 పైడిమర్రి రామచంద్ర,
మార్కాపురం అడ్వకేట్,
మార్కాపురం.

దావా సమను
మహారాజశ్రీ పర్చూరు జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్ట్‌లో
O.S. 64/2024

Between:-
ఇమ్మిశెట్టి కృష్ణ చైతన్య ...వాది
V/s
సోమేపల్లి దయాకర్ ...ప్రతివాది

To:
సోమేపల్లి దయాకర్, S/o. వెంకటేశ్వర్లు
R/o. యద్దనపూడి గ్రామం & మండలం.

పై కోర్ట్ నందు వాది ప్లైంట్ పరిహారం నిమిత్తం మీ పై దావా దాఖలు చేయగా సదరు దావా నందు మీ హాజరు నిమిత్తం వాయిదా ది.29.07.2025 కావున మీరు పై కోర్ట్ వారి యెదుట వాయిదా తేదీ. 29.07.2025న ఉదయం గం.10.30 ని.కు స్వయంగా కానీ వకీలు ద్వారా కానీ హాజరు అయి మీ ఆక్షేపణలు తెలుపు కొనవలెను. లేని యెడల మీ పరోక్షమున వ్యవహారం తీర్మానం చేయబడునని ఇందు మూలంగా తెలియ చేయుట మైనది.
వాయిదా తేదీ : 29.07.2025.

// కోర్ట్ వారి ఉత్తర్వులు మేరకు //
పర్చూరు,
తేదీ: 10.07.2025. ఇట్లు
పోతిని సురేంద్ర,
దగ్గుబాటి రాఘవయ్య చౌదరి.
వాది తరపు అడ్వొకెట్స్

మహారాజశ్రీ మార్కాపురం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.ఎ. నెం: 4/2024 ఇ.పి. నెం: 8/2023
ఓ.ఎస్. నెం: 173/2021

చిట్యాల పెద్ద వెంకటరెడ్డి ...క్లయిమ్ పిటీషనర్
వర్సెస్
1) మలిపెద్ది శివకేశవరావు
2) చక్కా రామక్రిష్ణారావు ...రెస్పాండెంట్లు

టు,
రెస్పాండెంట్ నెం: 2.
చక్కా రామక్రిష్ణారావు, తండ్రి: బాలచెన్నయ్య, హిందూ, ట్రేడర్, నివాసం: ఇంటి నెం: 3-396, అరొబిందోఘోష్ వీధి, మార్కాపురం టౌన్, మార్కాపురం మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు గల క్లయిమ్ పిటీషన్‌లో కోర్టు ద్వారా మరియు రిజిష్టర్ పోస్టు ద్వారా మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశ పూర్వకంగా కాలాయాపయన చేయుచున్నారు. అందు వలన శ్రీ కోర్టు వారు పై క్లయిమ్ పిటీషన్‌లో మీ యొక్క నోటీసులు నిమిత్తం తేదీ: 31-07-2025 వాయిదా వేసియున్నారు. సదరు తేదీన ఉదయం 10:30 గంటలకు మీరు స్వయముగా లేదా వకీలు ద్వారా హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షమందు పై కేసు విచారించి తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియ జేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేదీ: 31-07-2025
మధిరె శ్రీరామిరెడ్డి,
అడ్వకేట్, భాష్యం స్కూల్ రోడ్డు,
ఎస్.ఎస్.నగర్, మార్కాపురం.
సెల్: 9440183063.

ప్రజాశక్తి 3
సోమవారం 14 జూలై 2025

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-కొండపి

మండలంలోని పెట్లూరు సబ్ స్టేషన్ పరిధిలో 33 కెవి లైన్‌లో చెట్లు తొలగిస్తున్నందున సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పువ్వాడి శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ స్టేషన్ పరిధిలోని పెట్లూరు, కోయవారిపాలెం, గుర్రప్పడియా, దాదా నాయుడుపాలెం, చౌటపాలెం గ్రామాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామ ప్రజలు విషయాన్ని గమనించి విద్యుత్‌కు సంబంధించిన పనులను ముందుగానే ముగించుకోవాలని డిపార్ట్మెంట్‌కు సహకరించాలని ఆయన కోరారు.

కేబుల్ చోరీకి గురైన మోటారు

కేబుల్ వైరు చోరీ

దోర్నాలకు నిలిచిన నీటి సరఫరా

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల పట్టణానికి మంచినీరు సరఫరా చేసేందుకు గంటావానిపల్లి సమీపంలో రెండు బోర్లు వేశారు. ఆ రెండు బోర్లకు వంద మీటర్ల కేబుల్ వైరు ఏర్పాటు చేశారు. అయితే ఆదివారం తెల్లవారుజామున వంద మీటర్ల గల కేబుల్ వైరు మాయమైంది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి నలగాటి శివకోటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో కూడా ఇలాగే కేబుల్ వైరు మాయమైందన్నారు. కేబుల్ వైరు మాయం చేయడం మూలంగా బోరులో ఉన్న మోటారును పీకి దానికి కేబుల్ వైరును అమర్చి మరలా బోరులోకి దించాలన్నారు. ఈ ప్రక్రియ చాలా కష్టమైనని, దీనికి తోడు రెండు రోజుల సమయం పడుతుందన్నారు. ఈ రెండు రోజులు దోర్నాల పట్టణానికి మంచినీటి సరఫరా ఆగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ బోర్లకు అమర్చిన కేబుల్ వైర్లు కూడా మాయమవుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. దీంతో నష్టపోతున్నామని తెలిపారు. పోలీసులు డ్రోన్ కెమెరాల సహాయంతో దొంగల భరతం పట్టాలని వారు కోరుతున్నారు.

మృతి చెందిన సిరిగిరి చిన్న ఓబయ్య

ప్రమాదంలో దెబ్బతిన్న కారును పరిశీలిస్తున్న పోలీసులు

లారీని ఢీకొన్న కారు

భర్త మృతి.. భార్యకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-బేస్తవారిపేట

వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనడంతో భర్త మృతి చెందగా భార్యకు తీవ్ర గాయాలైన సంఘటన స్టేట్ హైవే రోడ్డులోని చింతలపాలెం సమీపంలో చీతిరాల కత్వ వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఈ ప్రమాదంలో గిద్దలూరు మండలం ఆదిమూర్తి పల్లె గ్రామానికి చెందిన సిరిగిరి చిన్న ఓబయ్య (52) అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకెళ్తే.. గిద్దలూరు మండలం ఆదిమూర్తి పల్లె గ్రామానికి చెందిన సిరిగిరి చిన్న ఓబయ్య మిలిటరీ ఉద్యోగంలో రిటైర్డ్ అయ్యి హైదరాబాదులోని బోడుప్పల్లో నివాసముంటూ ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం. ఆదివారం స్వగ్రామమైన ఆదిమూర్తి పల్లెలో పోలేరమ్మ తిరుణాళ్ల ఉందని బంధువులు సమాచారం ఇవ్వడంతో తిరునాళ్ళకు హాజరయ్యేందుకు హైదరాబాదు నుంచి శనివారం సాయంత్రం కారులో చిన్న ఓబయ్య అతని భార్య జ్యోతి స్వగ్రామానికి శనివారం సాయంత్రం బోడుప్పల్ నుంచి బయలుదేరారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో వేగంగా వెళ తున్న కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న లారీని కారు ఢీకొట్టడంతో చిన్న ఓబయ్య అక్కడికక్కడే మృతి చెందగా, భార్య జ్యోతికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఆమెకు వైద్య చికిత్స నిమిత్తం కంభం ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్య చికిత్స కోసం మార్కాపురం తరలించినట్లు ఎస్సై రవీంద్రారెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బేస్తవారిపేట ఎస్ఐ రవీంద్రారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్రం జాషువా వర్ధంతిని జయప్రదం చేయాలి

దళిత సేన ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-దర్శి

స్థానిక ఎంపిడిఓ కార్యాలయ ఆవరణంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర దళితసేన, ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదిన జరగబోతున్న మహాకవి గుర్రం జాషువా 54వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచార కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర దళిత సేన దర్శి నియోజకవర్గ అధ్యక్షులు గర్నెపూడి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 24న జరగబోతున్న గుర్రం జాషువా 54వ వర్ధంతి సభను దర్శి నియోజకవర్గంలో ఉన్న కవులు, పద్యాలు ఆలపించే కళాకారులు ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా పద్యాలు ఆలపించే కళాకారులు ముందుగా తమ పేరు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్ నెం. 9177079916, 9866239015లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు జూపల్లి కోటేశ్వరరావు, ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ వైవిరెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ బట్టు రామారావు, ప్రముఖ సంఘసేవకులు జీవి.రత్నం, పిట్ల రమేష్, బత్తుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దళితసేన, ప్రజాసంఘాల నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మండలం తిప్పాయపాలెం సమీపంలో ఆదివారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. కారు, ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు మృతి చెందారు. గేదెను తప్పించే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. మృతులు అర్ధవీడు మండలానికి చెందిన బెజవాడ దేవుడు(45), ఆకవీడు విజయ(22)గా పోలీసులు గుర్తించారు. మార్కాపురం రూ రల్ ఎస్సై పి.అంకమ్మరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ రైల్వే స్టేషన్ ఉత్తరం వైపు ప్లాట్ ఫామ్ వన్ చివరన గుర్తుతెలియని రైలు బండి ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. వయసు సుమారు 30 నుంచి 35 సంవత్సరాలు ఉంటాయని, మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. తెలుపు రంగు టీ షర్టు తెలుపు రంగు షార్ట్ వేసుకుని ఉన్నాడని, గడ్డం పెరిగి ఉందని తెలిపారు. ఒంగోలు ఆర్పి ఎస్ఐ మధుసూదన్ రావు గుర్తుతెలియని వ్యక్తి మతదేహాన్ని పరిశీలించి అక్కడ చుట్టుపక్కల వారిని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఈ ఘటన జరిగిందని వివరించారు. మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్ మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసినవారు ఎస్ఐ 9440627647 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

కోడిపందేల స్థావరంపై దాడి

12 మంది అరెస్టు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని బ్రాహ్మణ పల్లె పొలాల్లో కోడిపందాలు ఆడుతున్న 12 మందిని ఎస్సై ప్రభాకర్ రెడ్డి ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కోడిపుంజులను, రూ.11,200 నగదును, 10 సెల్ ఫోన్లు, రెండు మోటార్ సైకిల్, ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎస్పీ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు కోడిపందాల శిబిరంపై దాడి చేసినట్లు చెప్పారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో పేకాట ఆడుతు న్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ షేక్ రజియా సుల్తానా సిబ్బందితో ఆదివారం దాడి చేసి 11 మంది జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.46,330 నగదును స్వాధీ నం చేసుకొని, నిందితులపై కేసు నమోదు చేశారు. ఈ సంద ర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరూ చెడు వ్యసనాలకు బాని స కావద్దని సూచించారు. కుటుంబ బాధ్యతలను విస్మరించి పేకాట లాంటి జూదాలకు పాల్పడి కుటుంబాలను రోడ్డున పడేలా చేసుకోవద్దని తెలిపారు. జూద క్రీడలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎస్ఐ హెచ్చరిం చారు. అదేవిధంగా గ్రామ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా పేకాట జూదాలు ఆడుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గో ప్యంగా ఉంచుతామని ఎస్ఐ రజియా సుల్తానా తెలిపారు.

అనిల్‌బాబుకు 'దద్దాల' పరామర్శ

ప్రజాశక్తి-వెలిగండ్ల

నియోజకవర్గ వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు గూడూరి అనిల్ బాబు శనివారం సాయంత్రం కనిగిరి నుంచి పెళ్లి పనుల కోసం సంద్యాల వెళుతుండగా మార్గమధ్యంలో సంద్యాల ఘాటు వద్ద కారు డివైడర్‌ని ఢీకొని లోపల ప్రయాణిస్తున్న వైసీపీ నాయ కుడు అనిల్ బాబుకు గాయాలయ్యాయి. ఈ విషయం తెలు సుకున్న కనిగిరి వైసీపీ ఇంచార్జ్ దద్దాల నారాయణ యాదవ్, వెలిగండ్ల జడ్పిటిసి గుంటక తిరుపతి రెడ్డిలు మొగళ్లూరులోని ఆయన గృహానికి చేరుకొని అనిల్ బాబును పరామర్శించారు. పరామర్శించిన వారిలో వైసిపి కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, కటికల వెంకటరత్నం, వెలిగండ్ల సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు, ఆవుల తిరుపతిరెడ్డి, కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి ఉన్నారు.

బూచేపల్లి ట్రస్ట్ వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-చీమకుర్తి

బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర నేత్రాలయం సహకారంతో బూచేపల్లి కమలాకర్ రెడ్డి ఉచిత కంటి వైద్య శిబిరంనకు విశేష స్పందన లభించింది. ఆదివారం స్థానిక బూచేపల్లి కళ్యాణ మండపం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బూచేపల్లి కమలాకర్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా బూచేపల్లి కమలాకర్ రెడ్డి పార్కులో బూచేపల్లి కుటుంబ సభ్యులు బూచేపల్లి కమలాకర్ రెడ్డి స్మృతిపదంలో నివాళులర్పించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. 4,500 మందికి అన్నదానం చేశారు. కంటి వైద్య శిబిరంలో శంకర కంటి ఆసుపత్రి వైద్యులు దాదాపు 1600 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 650 మందికి ఆపరేషన్లు చేయాలని నిర్ణయించారు. వీరికి బూచేపల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర్ నేత్రాలయం వైద్యులు ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శి ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి నందిని దంపతులు, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, మాజీ మంత్రి మేరుగు నాగార్జున, వైసిపి జిల్లా నాయకులు బత్తుల బ్రహ్మానంద రెడ్డి, జడ్పిటిసి వేమ శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, ఒంగోలు వైసిపి ఇన్చార్జి చుండూరు రవి, మున్సిపల్ చైర్పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి చంద్ర, నర్ర ధనలక్ష్మి, బూచేపల్లి రిలాశ రెడ్డి, బూచేపల్లి హాసిని, బూచేపల్లి తన్విత, ప్రముఖ వైద్యులు డాక్టర్ బి జవహర్, డాక్టర్ చెరుకూరి వెంకటేశ్వర్లు, జడ్పిటిసి దుంప రమణమ్మ, జిల్లాలోని వివిధ మండలాల జడ్పిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మందులు పంపిణీ చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివ ప్రసాద్ రెడ్డి

కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ప్రజాసంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వేమూరు

ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని శాసన సభ్యులు నక్క ఆనందబాబు అన్నారు. మండలంలోని పెరవలిపాలెం, పెరవలి గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికి తిరిగి సుపరిపాలన కరపత్రాలు పంపిణీ చేశారు. ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేసేందుకు, ఇంటి ఇంటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వేమూరు ఎఎంసి చైర్మన్ గొట్టిపటి జయ వెంకట పూర్ణ కుమారి, భాను గంగాధర్, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - చీరాల

సీఎం సహాయ నిధి పేదలకు వరం వంటిదని శాసన సభ్యులు కొండయ్య అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులు ఆదివారం పంపిణీ చేశారు. 46 మంది లబ్ధిదారులకు రూ.40.05 లక్షల విలువైన చెక్కులు బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ సలగల రాజశేఖర్ సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించే దిశగా చర్యలు చేపట్టారని తెలిపారు.

సొసైటీ అధ్యక్షునిగా బాధ్యతలు తీసుకుంటున్న శ్రీనివాసరావు

సొసైటీ అధ్యక్షుడిగా 'మోర్ల'

ప్రజాశక్తి - నగరం

మండలంలోని పూడివాడ సహకార సంఘం సొసైటీ అధ్యక్షునిగా మోర్ల శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి కావలసిన ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి పరంగా ముందుకు తీసుకెళ్తామని అన్నారు. రైతుల సహాయ సహకారాలు, సూచనలతో కలిసి మెలిసి అభివృద్ధి చేస్తామని అన్నారు. మంత్రి అనగాని సత్య ప్రసాద్ ఆశయాల మేరకు పనిచేసి తనకు ఇచ్చిన బాధ్యత సమర్ధవంతంగా నిర్వహిస్తానని చెప్పారు. సొసైటీల ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. రైతులు బ్లాకులో ఎరువులు కొనలేక పోతున్నారని, సొసైటీల ద్వారా రైతులకు కావలసిన ఎరువులు అందుబాటులో తేవాలని సూచించారు. మాజీ ఎంపీటీసీ బాల కోటేశ్వరరావు మాట్లాడుతూ సొసైటీకి ఏకగ్రీవంగా ఎన్నికైన మోర్ల శ్రీనివాసరావు రైతులు కావలసిన రుణాలు అందించి ఆదుకోవాలని కోరారు. తెలుగుదేశం నాయకులు లుక్కా గుడారంకయ్య మాట్లాడుతూ రుణాలు పొందిన రైతులు సకాలంలో చెల్లిస్తే సొసైటీలు అభివృద్ధి చెందుతాయని, మరెన్ని సేవలు చేయవచ్చని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి విచ్చారపు వీరయ్య, జడ్పిటిసి నాగమణి, పూర్ణయ్య, చింతల వీరయ్య, సెక్రటరీ బుజ్జి పాల్గొన్నారు.

సమ్మె బాట పట్టిన ఇంజినీరింగ్ కార్మికులు

బాపట్లలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి మజుందర్

ప్రజాశక్తి - బాపట్ల

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఆదివారం అర్ధరాత్రి నుండి సమ్మెబాట పట్టారు. స్థానిక పురపాలక సంఘంలో విద్యుత్తు, త్రాగునీరు, ఇతర ఇంజనీరింగ్ విభాగంలో సేవలు నిలిచిపోయాయి. కార్మికులు విధులు బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో బైఠాయించారు. సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మెలో కార్మికులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం అయ్యేవరకు విధుల్లోకి హాజరయ్యేది లేదని మొండికేసి కూర్చున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందారు మాట్లాడుతూ మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కార్మికులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ఇంజనీరింగ్ కార్మికులు చాలీచాలని వేతనాలతో జీవనం సాగించలేక ఆర్ధిక ఇబ్బందులకు లోనవుతూ మైక్రో ఫైనాన్స్ సంస్థల దగ్గర అప్పులు తీసుకొని అధిక వడ్డీలతో అప్పులు తీర్చలేక మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరగడం, కుటుంబంలోని తల్లి, దండ్రులకు అనారోగ్యపరమైన సమస్యలతో కార్మికులు నిత్యం ఆర్థికపరమైన సమస్యలు ఎదుర్కొంటూనే ఉన్నారని అన్నారు. ఈ సమస్య తీరాలంటే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రతి కార్మికుడికి రూ.26 వేలు వేతనం ఇవ్వాలని అన్నారు. తప్పని పరిస్థితుల్లో సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందని పేర్కొన్నారు. కార్మికుల సమ్మెతో పట్టణంలో త్రాగు నీరు, విద్యుత్తు వంటి విధులకు విఘాతం కలిగి ప్రజలు ఇబ్బందులకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. కార్మికుల సమ్మె ఉధృత రూపం దాల్చకముందే కార్మికులకు స్కిల్డ్, సెమిస్కిల్డ్ వేతనాలు అమలుచేసి, జిఒ నెంబర్ 36 ప్రకారం రూ.24,500 వేతనం చెల్లించాలని కోరారు. గత ఏడాది జరిగిన 17రోజుల సమ్మె ఒప్పందాలు అమలు చేయాలని అన్నారు. శిబిరంలో సిఐటియు నాయకులు శరత్, మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు యూనియన్ జిల్లా నాయకులు రత్నం, నాని, అశోక్, పట్టణ నాయకులు మురళీకృష్ణ, హరిబాబు, వెంకటేశ్వరరెడ్డి, సాంబిరెడ్డి, ప్రమీల, నరేష్ పాల్గొన్నారు.

అద్దంకి : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు కనీస వేతనం అమలు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, గత సమ్మె కాల ఒప్పందాలు అమలు చేయాలని కోరుతూ సమ్మె చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఆదివారం ధర్నా శిబిరం ఏర్పాటు చేశారు. ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ కావూరి రఘు చంద్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడే కృషి చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని అన్నారు. కార్మికుల సమ్మెకు సిఐటియు నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, మెడకల్ అండ్ హెల్త్ యూనియన్ నాయకులు కెవి రాజు, ఐలు నాయకులు డి గంగాధర్, ప్రజా సంఘాల నాయకులు నాగేశ్వరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి ఆదాం, ఇంజనీరింగ్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు వి జాన్, ఉసురుపాటి సామ్యూల్, మారుతి, జాషువా, మార్కు పాల్గొన్నారు.

అద్దంకిలో ధర్నా చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

వీధి దీపాలు వెలగక చీకట్లో పట్టణ ప్రజలు

చిమ్మ చీకట్లో బాపట్ల పట్టణం

ప్రజాశక్తి - బాపట్ల

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెతో పట్టణంలో వీధి దీపాలు వెలగడం లేదు. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఆదివారం రాత్రి చిమ్మ చీకట్లు అలుముకున్నాయి. సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల సమ్మెలో ఉన్నారు. వార్డుల్లో సైతం వీధి దీపాలు వెలగడం లేదు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

స్మార్ట్ మీటర్లను తిరస్కరించండి

ప్రజాశక్తి - రేపల్లె

ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించకుండా ప్రజలు తిరస్కరించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ పిలుపు నిచ్చారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రతిపక్షంలో ఉన్నపుడు స్మార్ట్ మీటర్లు వద్దు పగలగొట్టండని చెప్పి కోర్టులో కేసులు వేసిన టిడిపి నేతలు ఇప్పుడు ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి అనేక రూపాల్లో విద్యుత్ చార్జీలు పెంచుతున్నారని అన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని, ప్రజలు వినియోగించిన విద్యుత్‌కు బిల్లులు చెల్లిస్తున్నప్పటికీ మళ్లీ సర్ ఛార్జీల పేరుతో రెండో సారి వసూళ్లు చేయడం మానుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం అదానీ కోసం పనిచేస్తుందని ఆరోపించారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఎం కార్యదర్శి మణిలాల్

పరిశ్రమలు, వాణిజ్య సముదాయాలు, చిరువ్యాపారులకు బిగించారనీ, ఇప్పుడు అపార్టు మెంట్లు, ప్రజల ఇళ్లకు బిగించడానికి సిద్ధపడ్డారని అన్నారు. ప్రజల మీద అదనపు భారాలు పడే విద్యుత్ స్మార్ట్ మీటర్లు తిప్పికోటాలని అన్నారు. పట్టణంలో దశలు వారి పోరాటం చేస్తామని అన్నారు. సమావేశంలో సిపిఎం పట్టణ శాఖ కార్యదర్శి కె అగస్టిన్, కెవి లక్ష్మణరావు, డి అగస్టిన్, కె రమేష్, కె వెంకట్ పాల్గొన్నారు.

యువతను క్రీడల పట్ల ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - బాపట్ల

గ్రామీణ ప్రాంత యువతను క్రీడల పట్ల ప్రోత్సహించేందుకు ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గ్రామాల్లో క్రికెట్ వంటి క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ (సిసా) అకాడమీ కన్వీనర్ ఎన్ శ్రావణ్ కుమార్ అన్నారు. మండలంలోని కొండు భొట్లపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో సౌత్ జోన్ నేషనల్ ఛాంపియన్ షిప్ క్రికెట్ ఫైనల్స్ పోటీలు ఆదివారం నిర్వహించారు. క్రీడల్లో విజేతలకు బహుమతులను జనసేన ఇన్‌ఛార్జి నామన వెంకట శివన్నారాయణ అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే క్రీడల పట్ల యువతలో ఉత్సాహాన్ని పెంచేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు కృషి చేయాలని అన్నారు. అందుకు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. మాజీ సైనిక సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు తాంండ్ర సాంబశివరావు మాట్లాడుతూ క్రీడల ప్రోత్సాహానికి తమ సంఘం విశేషంగా కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు, యువతలో క్రీడాసక్తిని పెంచేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. విన్నర్స్, రన్నర్స్‌కు మొమెంటోలు, ధ్రువీకరణ పత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో మొమెంటో దాతలు చైతన్య, రాంబాబు, శ్రీనివాసరావు, నామన శ్యామ్, నామన అధిశేషు, శివకుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

సభలో పాల్గొన్న కౌలు రైతు జిల్లా నాయకులు పి కొండయ్య

కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

ప్రజాశక్తి - పర్చూరు

భూ యజమానితో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు కౌలు కార్డులు ఇవ్వాలని కౌలు రైతుల మండల మహాసభ డిమాండ్ చేసింది. కొమ్మినేని శ్రీనివాసరావు అధ్యక్షతన కౌలు రైతుల మండల మహాసభ నిర్వహించారు. సభలో కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు పి కొండయ్య మాట్లాడారు. గత మూడేళ్లుగా కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. వేసిన పంటల దిగుబడి లేక, గిట్టుబాటు ధరలు రాక కుందేలైవుతున్నారని అన్నారు. ప్రత్తి, మిర్చి, పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. వారితో మామిడి రైతులు కూడా చేరారని అన్నారు. ఏ పంటకు గిట్టుబాటు ధర లేని పరిస్థితి ఉందని అన్నారు. కౌలు రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడంలేదని అన్నారు. రకరకాల పేర్లతో వ్యవసాయ భూములను స్వాధీనం చేసుకోవడం దారుణమని అన్నారు. రాజధాని విస్తరణ, పారిశ్రామిక వేత్తలకు పందేరం చేయడానికి ఉలవపాడులో మామిడి వనాలను నాశనం చేయడానికి పూనుకోవడం దారుణమని అన్నారు. కైలు రైతు సంఘం మండల అధ్యక్షులు కమలా ఆదాం, ప్రధాన కార్యదర్శి కూరాకుల రాజేష్, ఉపాధ్యక్షులు సాదిక్, సహాయ కార్యదర్శి వంగిపురం శ్రీనివాసరావుతోపాటు మరో ఏడుగురితో నూతన కమిటీ ఎన్నుకున్నారు. కౌలు రైతులందరికీ భూ యజమానితో నిమిత్తం లేకుండా కౌలు కార్డులు ఇవ్వాలని, అన్నదాత సుఖీభవ పథకం కౌలు రైతులకు వర్తింపజేయాలని, అసైన్డ్ భూముల రైతులకు భూములు ఆన్లైన్ చేసి అన్నదాత సుఖీభవ రాయితీ ఇవ్వాలని, సన్న, చిన్న రైతుల వద్దనున్న పొగాకు వెంటనే కొనుగోలు చేయాలని, రుణాలు ఇవ్వాలని, బంగారం పెట్టి రుణాలు తీసుకున్న రైతుల వద్ద వడ్డీ కట్టించుకుని రెన్యువల్ చేయాలని, పొగాకు కొనుగోలను ప్రైవేటు వ్యాపారుల వద్ద అడ్డుకుంటున్న గ్రామాల్లోని ఏజెంట్లను నివారించాలని మహాసభలో తీర్మానం చేశారు.

గురువులు లేక.. బోధన సాగక..

- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నియోజకవర్గం విద్యా రంగం విషయంలో ఈ ఏడాది తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఇటీవల నిర్వహించిన బదిలీల్లో ఈ ప్రాంతం నుంచి వందల సంఖ్యలో ఉపాధ్యాయులు వెళ్లిపోయారు. ఆయా స్థానాల్లోకి కొత్తగా చేరినవారు ముప్పై శాతం కూడా లేరు. ఫలితంగా బడులు తలకిందులైపోయాయి.

గణాంకాలు ఇలా..

యర్రగొండపాలెం మండలం నుంచి 150 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారు. కేవలం 20 మంది మాత్రమే కొత్తగా వచ్చి చేరారు. ప్రస్తుతం 159 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పుల్లలచెరువు మండలంలో 71 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లగా కేవలం ఇద్దరు మాత్రమే వచ్చారు. మొత్తం 138 ఖాళీలు ఉన్నాయి. త్రిపురాంతకం మండలంలో 90 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లగా 32 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. ఇంకా 89 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పెద్దారవీడు మండలంలో 36 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లగా 24 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. ఇంకా 20 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పెద్దదోర్నాల మండలంలో 52 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లగా 27 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. ఇంకా 80 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

బడులు ఉన్నా..బోధించేవారు లేరు

యర్రగొండపాలెం మండలంలోని కొలుకుల జడ్‌పి ఉన్నత పాఠశాల 13 ఉపాధ్యాయ పోస్టులకు గాను కేవలం ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. వీరభద్రాపురం జడ్‌పి ఉన్నత పాఠశాలలో ఆంగ్లం, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టులను బోధించేందుకు ఉపాధ్యాయులే లేరు. పుల్లలచెరువు జడ్‌పి ఉన్నత పాఠశాలలో 24 మంది ఉపాధ్యాయులకు గాను ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. మర్రివేముల ఉన్నత పాఠశాలలో 19 మంది ఉపాధ్యాయ పోస్టులకు గాను ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే మిగిలారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు చదువుకు రావడమే పెద్ద సాహసం అవుతోంది. గురువు లేని తరగతుల్లో నిశ్శబ్దంగా ఖాళీ కుర్చీలతోనే చదువుకుంటున్నారు.

తల్లిదండ్రుల ఆవేదన..

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు అందిస్తుందని ఆశ పడితే చదువు చెప్పే వారే లేరని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రైవేటు పాఠశాలలే దిక్కని పేర్కొంటున్నారు. టిసిలు ఇస్తే వేరే పాఠశాలల్లో చేర్చుకుంటామని చెబుతున్నారు.

బదిలీ వ్యవస్థ విద్యా వ్యవస్థను గజిబిజి

తాజా బదిలీలలో వెళ్లే వారిని పంపిన ప్రభుత్వం ఇక్కడ పని చేయాలనుకునే వారిని మాత్రం తీసుకురాలేక పోయింది. కొన్ని పాఠశాలలకు అసలు ఒక్కరైనా చేరలేవంటే నియోజకవర్గంలో విద్యా దుస్థితి ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతుంది. అడ్జస్ట్‌మెంట్ పేరిట 50 శాతం ఉపాధ్యాయులను తిరిగి పంపే ప్రయత్నం చేస్తున్నా కొందరు ఉపాధ్యాయులు తాము మళ్లీ రావాటానికి ఒప్పుకోవడం లేదు. ఇక్కడి పాఠశాలలో సదుపాయా లేమీ లేవు. రవాణా సౌకర్యాల గురించి చెప్పనక్కర్లలేదు.

విద్యార్థులకు అన్యాయం

ఉపాధ్యాయులు లేకపోవడం తో విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మారుమూల ప్రాంతాల్లో పని చేసే ఉపాధ్యాకయులు ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించి విద్యాబోధన జరిగేలా చూడాలని కోరుతున్నారు. ఉపాధ్యాయుల అవసరాలను తక్షణమే గుర్తించి డీఎస్సీ నియామకాలు వేగవంతం చేయాలన్నారు

హారికపై దాడి హేయం : బూచేపల్లి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

కృష్ణా జిల్లా, గుడివాడ జడ్‌పి చైర్‌పర్సన్, బీసీ మహిళా నాయకురాలు ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన గూండాలు పోలీసుల సమక్షంలోనే దాడి చేసిన ఘటనపై ప్రకాశం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. మహిళా నాయకురాలిపై దాడి చేయడం చంద్రబాబు శాడిజానికి పరాకాష్టగా ఆరోపించారు. 'బాబుష్యూరిటీ–మోసం గ్యారంటీ' సభకు వెళ్తుండగా నాగవరప్పాడు వద్ద హారిక కారు అడ్డగించి రాళ్లు, కర్రలతో దాడి చేశారని తెలిపారు. ఆ సమయంలో అక్కడ పోలీసులు ఉన్నా అడ్డుకోలేదని ఆమె విమర్శించారు. జిల్లాకు ప్రథమ పౌరురాలికి రక్షణ కల్పించ పోవడం దారుణమన్నారు. ఈ ఘటనపై సిఎం చంద్రబాబు, హో మంత్రి అనిత సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అరగంటలోనే జిల్లా పరిషత్ చైర్మన్‌లకు కేటాయించిన గన్ మెన్లను తొలగించారని ఆరోపించారు. ఇలాంటి సంస్కృతి గత 40 ఏళ్ళు గా ఏ ప్రభుత్వం లోనూ తాము చూడలేదన్నారు. గన్ మెన్లు ఉంటే ఈ మూక దాడి జరిగేది కాదన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ప్రథమ పౌరురాలికి రక్షణ లేకుంటే సాధారణ మహిళలకు ఏ రక్షణ ఉంటుందో చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. హోం మంత్రి మహిళ అయి ఉండి మహిళా ప్రజాప్రతినిధిపై దాడి జరిగితే నోరు మెదపకపోవడం విచారకరమన్నారు. దాడికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కే కుట్రలకు వైసీపీ భయపడదని వెంకాయమ్మ హెచ్చరించారు. ఇలాంటి దాడులతో వైసీపీ శ్రేణులు వెనక్కి తగ్గవని తెలిపారు. ప్రజల నమ్మకంతో ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తాం. దళితులు, బీసీలు, మహిళలకు రక్షణగా నిలిచేది తమ పార్టీయేనని వెంకాయమ్మ స్పష్టం చేశారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ మాట్లాడుతూ ఆడపడుచులంటే వల్లమాలిన అభిమానం అని చెప్పుకునే ఉప ముఖ్యమంత్రి ఈ ఘటన పై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో హనుమంతుని పాడు ఎంపిపి గాయం సావిత్రి, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి సన్నపు రెడ్డి రవణమ్మ, రాష్ట్ర మహిళా కార్యదర్శులు భూమిరెడ్డి రవణమ్మ,మేడికొండ జయంతి, రాష్ట్ర వాలంటీర్ కార్యదర్శి గోనెల మేరీ కుమారి , ఒంగోలు నియోజకవర్గ ఎస్‌టి సెల్ అధ్యక్షురాలు పేరం ప్రసన్న, ఒంగోలు నియోజకవర్గ అంగన్‌వాడీ అధ్యక్షురాలు వడ్లమూడి వాణి , ఒంగోలు నగర మహిళా అధ్యక్షురాలు బత్తుల ప్రమీల , సయ్యద్ అప్సర్, నాగమణి, ముడుసు సంధ్య, బి. శైలజ, డి. నాగలక్ష్మి, కె. రమణ, మద్దూలూరు సర్పంచి కె. లక్ష్మి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

టిడ్కో ఇళ్లకు నిధులు విడుదల చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఒంగోలు పట్టణంలో గతంలో ప్రారంభించి అసంపూర్తిగా నిలిచిపోయిన టిడ్కో ఇళ్లకు తక్షణమే రూ.180 కోట్లు విడుదల చేసి నిర్మాణాన్ని పూర్తి చేయాలని సిపిఎం ఒంగోలు నగర కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక సుందరయ్య భవన్‌లో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు జి.రమేష్ అధ్యక్షతన నగర కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు మాట్లాడుతూ 2018లో టిడిపి హయాంలో కొప్పోలు, చింతల ప్రాంతాల్లో 4,128 ఇళ్ల నిర్మాణం ప్రారంభించినట్లు తెలిపారు. కొప్పోలు ప్రాంతంలో 2,736 ఇళ్లు, చింతల ప్రాంతంలో 1,392 ఇళ్లు అర్ధాంతరంగా నిలిచిపోయాయని తెలిపారు. 52 నుంచి 66 శాతం వరకు మాత్రమే పనులు పూర్తయినట్లు తెలిపారు. మిగతా పనులు నిలిచిపోయినట్లు తెలిపారు.కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించకపోవడం వల్ల పనులు నిలిచినట్లు తెలిపారు. విద్యుత్, మురుగు నీరు కాలువలు తదితర పనులకు నిధులు అవసరమన్నారు. నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉగాది నాటికి ఇళ్లు అందజేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. లబ్ధిదారులు వడ్డీలు, లోన్ల భారం మోస్తూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే ఇళ్లు పూర్తి చేసి అందించకుంటే లబ్ధిదారులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో సిపిఎం నాయకులు తంబి శ్రీనివాసులు, వీరాస్వామి, టి.మహేష్,బివి.రావు,జి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు

15న కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి - ఒంగోలుసిటీ

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 15న కలెక్టరేట్ ధర్నా నిర్వహించనున్నట్లు స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి. అంకిరెడ్డి, జనరల్ సెక్రటరీ కంచర్ల సుబ్బారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు ధర్నా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు. అదే రోజు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర ఆర్థిక బిల్లులో భాగంగా ప్రవేశపెట్టిన పెన్షన్ వ్యాలిడేషన్ సవరణను వెంటనే రద్దు చేయాలన్నారు. కేంద్రంలో 8వ పిసిఆర్‌సి, రాష్ట్రంలో 12వ పిఆర్‌సి తక్షణమే నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు. పెండింగ్ బకాయిలు, డిఆర్ బకాయిలు చెల్లించాలన్నారు. ఉద్యోగ, పెన్షనర్లకు సమగ్ర ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయాలన్నారు. రైల్వే, విమాన ప్రయాణాల్లో సీనియర్ సిటిజన్లకు రాయితీలు తిరిగి అమలు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర పెన్షనర్లకు కమ్యూటేషన్ కాలాన్ని 15 సంవత్సరాల నుంచి 11 సంవత్సరాలకు తగ్గించాలన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న ధర్నాలో పెన్షన్లరు అధిక సంఖ్యలో పాల్గొనిక జయప్రదం చేయాలని వారు కోరారు.

నేటి నుంచి హెచ్‌ఎంలకు శిక్షణ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ నైపుణ్యాలు, పరిపాలనా సామర్థ్యాలు అభివద్ధి చేసేందుకు ప్రత్యేకంగా లీడర్‌షిప్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎ.కిరణ్ కుమార్ ఆదివారం ఓ ప్రకటన లో తెలిపారు. ఈ నెల 14 నుంచి 17 వరకూ పొదిలి లోని జోసెఫ్ శ్రీ హర్ష అండ్ మేరి ఇంద్రజ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రాంగణంలో రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మొదటి ఫేజ్‌లో 320 మంది ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించిన జాబితాను ఇప్పటికే మండల విద్యాధికారులకు పంపినట్లు ఆయన పేర్కొన్నారు. పూర్తి కాల పరిమితి ఉన్న రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించే శిక్షణలో ప్రధానోపాధ్యాయులు నిర్ధిష్ట తేదీలలో ఖచ్చితంగా పాల్గొలన్నారు. తమ స్కూళ్లలో మరింత ప్రమాణాలున్న విద్యా నిర్వహణకు తోడ్పడాలని డిఇఒ సూచించారు.

సిసిటివిలో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువకులకు సిసిటివి కెమెరా ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్, రిపేర్ మరియు సెక్యూరిటీ అలారమ్ వ్యవస్థలపై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు రూట్‌సెట్ సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 24వ నుంచి ఆగస్టు 5 వరకూ 13 రోజుల పాటు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగిన యువకులు పేర్ల నమోదు చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు.శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 9573363141 నంబర్ ద్వారా సంప్రదించి మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

18న మండల సమావేశం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 18న నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ డి.జయమణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కట్టా శోభారాణి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల పనితీరుపై చర్చించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు అధికారులు సకాలంలో హాజరు కావాలని ఎంపిడిఒ కోరారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని జాగర్లమూడి గ్రామానికి చెందిన కొడవటి పవన్ కుమార్ అనే ఇంజనీరింగ్ విద్యార్థికి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కొల్లా సాంబశివరావు రూ.40 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణ మోహన్ దాత కొల్లా సాంబశివరావును అభినందించారు. చదువుపై ఆసక్తి కలిగిన నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు దాతలు పెద్ద మనసుతో ముందుకు వచ్చి సహాయ, సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, పంబి సదానందరెడ్డి, రావి సతీష్ బాబు, కోడూరి సుబ్రహ్మణ్యాచారి, కారుమూడి సుబ్బారెడ్డి, పవన్ కుమార్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కరపత్రాలు అందజేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - సంతమాగులూరు

ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయటమే తమ ప్రభుత్వ ధ్యేయమని మాజీ సొసైటీ అధ్యక్షులు, తెలుగుదేశం నాయకులు దుద్దేల గాలెయ్య తెలిపారు. మండలంలోని ఏల్చూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి కరపత్రాలను అందజేశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత వైసిపి ప్రభుత్వం నవరత్నాల పేరుతో ప్రజలను దగా చేసిందని అన్నారు. నేటి తమ ప్రభుత్వం వ్యవస్థల పునర్నిర్మాణానికి కృషి చేస్తుందన్నారు. గ్రామాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజీ పనులు, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల అదనపు హాస్టల్ భవనాల పనులు ముమ్మరంగా సాగుతున్నట్లు తెలిపారు. రానున్న కాలంలో గ్రామాన్ని ఆదర్శ వంతంగా తీర్చిదిద్దుతామని అన్నారు. అనంతరం టిడిపి కార్యకర్తలకు గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి మందా సూరిబాబు, నాయకులు కుంచాల సుబ్బారావు, బండారు వెంకటేశ్వర్లు, నక్కా వెంకటేశ్వర్లు, దక్కా హనుమంతరావు, దేశింగ రాజు, వల్లెం నాసరయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలో కొత్తగా నిర్మించుకున్న విద్యుత్తు టవర్ లైన్ పనుల కారణంగా ఎన్టీఆర్ నగర్, ద్వారకా నగర్, టైలర్స్ కాలనీ, ఆటోనగర్, భవాని సెంటర్ నుండి సింగరకొండ వరకు రోడ్డుకు రెండు వైపులా, కలవకూరు రోడ్డు నందు ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు డిఇఇ ఎం దామోదరం తెలిపారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

రేపల్లె : పట్టణంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒక గంట వరకు రేపల్లె టౌన్ 3వ ఫీడర్‌లో ఆర్‌డిఎస్ఎస్ స్కీం ద్వారా అభివృద్ధి పనులు జరుగుతన్న కారణంగా పట్టణంలోని అరవపల్లి రోడ్డు, పెనుముడి రోడ్డు, కోట సెంటర్, అంకమ్మచెట్టు సెంటర్, గునివారి పాలెం ఏరియాల్లో, చిన్న ఆరవపల్లిలో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. ప్రజలు ముందస్తుగా నీళ్లు పట్టుకుని సహకరించాలని కోరారు.

షుగర్ వ్యాధిగ్రస్తులు జీవన శైలి మార్చుకోవాలి

వైద్య నిపుణురాలు డాక్టర్ మంచాల విద్య

ప్రజాశక్తి - పంగులూరు

షుగర్ వ్యాధిగ్రస్తులు ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారంతో పాటు జీవనశైలి కూడా మార్చుకోవాలని షుగర్ వైద్యనిపురాలు డాక్టర్ మంచాల విద్య సూచించారు. గంగవరం ఆరోగ్య సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో మంచాల వెంకటరామయ్య, రంగమ్మ విద్య వైజ్ఞానిక కళ్యాణ వేదికలో ఆదివారం ఏర్పాటు చేసిన షుగర్, బిపి రెగ్యులర్ వైద్య శిబిరం ప్రారంభంలో ఆమె మాట్లాడారు. షుగర్ వ్యాధి నూటికి 80 శాతం మంది ప్రజల్లో ఉందని, మనం తినే ఆహారం, టెన్షన్, జీవనశైలి ద్వారా వస్తుందని అన్నారు. దీన్ని నియంత్రణలో పెట్టుకునేందుకు మన చేతుల్లోనే ఉందని అన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడటంతో పాటు ఆందోళన తగ్గించుకోవాలని చెప్పారు. జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలని చెప్పారు. తన తండ్రి, తాతల వారసత్వంగా తాను సమాజం కోసం పనిచేయాలని, పేదలను ఆదుకోవాలనే ఉద్దేశం ఉందని అన్నారు. గంగవరంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం ఎంతో మంది పేదలకు ఉపయోగపడుతుందని చెప్పారు. డాక్టర్ మంచాల రమేష్ కుమార్ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరాన్ని విస్తృత పర్చాల్సిన అవసరం ఉందని అన్నారు. వీలైనంత మంది ఎక్కువ పేదలకు అందుబాటులోకి వైద్యం తీసుకురావాలని అన్నారు. వైద్య శిభిరం కన్వీనర్ కరి బాలచంద్రం మాట్లాడుతూ రెండు నెలలకు ఒకసారి క్రమం తప్పకుండా నిర్వహించే ఈ వైద్యశిభిరంకు అనేక

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మంది దాతలు సహకరిస్తున్నారని అన్నారు. వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ మెడికల్ క్యాంపుకు శంకరశెట్టి రామయ్య, ఆయన ధర్మపత్ని కోటమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రీనివాసరావు, మంచాల వెంకటరామయ్య, రంగమ్మ, మంచాల అనంత విజయ లక్ష్మి, రవిబాబు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. డాక్టర్ మంచాల రమేష్ కుమార్, డాక్టర్ మంచాల విద్య, డాక్టర్ అన్నవరపు సాంబయ్య రోగులను పరీక్షించి వైద్య సలహాలు ఇచ్చారు. క్యాంపులో షేక్ కమల్ బాబు, కరి జగన్నాధరావు, కరి బాలచంద్రం, కరీ సృజన, తలపనేని రామారావు, తంగా శ్రీనివాసరావు, కుర్రి అజయ్, శంకరశెట్టి చంద్రరావు, విశాఖపట్నం నుండి కుటుంబ సమేతంగా వచ్చిన టివి సుబ్బారావు, టి పార్వతి, వలేటి విజయలక్ష్మి, ఎవి సుబ్బారావు వాలంటీర్లుగా పని చేశారు. కందిమల్ల రామ కోటేశ్వరరావు, బోడెంపూడి సూరిబాబు, కరీ రాధాకృష్ణమూర్తి పర్యవేక్షించారు.

పొగాకు నిల్వలు కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - ఇంకొల్లు

చిన్న, సన్న కారు రైతుల వద్ద నిల్వ ఉన్న పొగాకు మొత్తం వెంటనే కొనుగోలు చేయాలని కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక నాయకులు టి యేషయ్య అధ్యక్షతన జరిగిన కౌలు రైతుల సమావేశం డిమాండ్ చేసింది. పొగాకు కొనుగోలు కేంద్రాల్లో అధికార టిడిపికి చెందిన వారు సిఫార్సు చేసిన వారి పొగాకే కొంటున్నారని ఆరోపించారు. చిన్న రైతుల వద్ద పొగాకు కొనుగోలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు సంఘం నాయకులు కందిమల్ల రామకోటేశ్వరరావు మాట్లాడుతూ పొగాకు కొనుగోలు వేగవంతం చేయాలని, కాల వ్యవధి లేకుండా మొత్తం పొగాకు నెలాఖరులోపు కొనాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం నాయకులు పి కొండయ్య మాట్లాడుతూ అర్హులై సాగు చేస్తున్న కౌలు రైతులందరికీ కౌలు కార్డులు భూ యజమానితో నిమిత్తం లేకుండా గ్రామ సభలు జరిపి కౌలు కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం మండల కన్వీనర్‌గా నలతోటి భాను ప్రసాద్, కె గంగయ్య, మార్పు ప్రసాద్, టి యేసయ్య, రవీంద్రబాబు సభ్యులుగా ఎన్నికయ్యారు. జూలై 20న కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో జరిగే కౌలు రైతు సంఘం జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. మహాసభలకు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వి కృష్ణయ్య, కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు, జిల్లా నాయకులు హాజరవుతారని తెలిపారు.

నూతన కమిటీని సత్కరిస్తున్న సభ్యులు

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఆర్యవైశ్య యువజన సంఘాల నూతన కమిటీ పదవీ ప్రమాణ స్వీకార మహెూత్సవం ఆదివారం స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆవరణలో నిర్వహించారు. 2025 – 27కు ఎంపికైన కమిటీ పని చేస్తుందని అధ్యక్షులు తూనుగుంట్ల సాయిబాబా తెలిపారు. ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షులు తూనుగుంట్ల శ్రీనివాసరావు, తెనాలి పురపాలక సంఘ మాజీ చైర్మన్ పెండ్యాల వెంకటరావు, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుండూరు ఉమామహేశ్వరరావు, స్థానిక టీఎం రావు హై స్కూల్ హెచ్‌ఎం చందలూరి రామకోటేశ్వరరావు అతిధులుగా హాజరయ్యారు. సంఘం మండల అధ్యక్షులు చన్నా వెంకట ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బూర్లె సుబ్బారావు, కోశాధికారి సుగ్గుల మధుసూదనరావు, పట్టణ అధ్యక్షులు మద్దుల చంద్ర కిషోర్, ప్రధాన కార్యదర్శి కెవి నాగరాజన్, కోశాధికారి నాళం కోటేశ్వరరావు, యువజన సంఘం అధ్యక్షులు అచ్యుత నాగ రమేష్, ప్రధాన కార్యదర్శి కొత్త నాగ వెంకట రవితేజ, కోశాధికారి మానేపల్లి జగదీష్, వీరితోపాటు కార్యవర్గ సభ్యులు 100 మంది పదవీ ప్రమాణ స్వీకారం చేశారు.

మాట్లాడుతున్న రోటరీ గవర్నర్ ఎస్‌వి రాంప్రసాద్

రోటరీ సేవలు విస్తృతం చేయాలి

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆదివారం పట్టణంలో మన్నం త్రిమూర్తులు సహకారంతో పండ్ల మొక్కలు నాటారు. రోటరీ గవర్నర్ డాక్టర్ ఎస్‌వి రాంప్రసాద్ సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. స్థానిక శ్రీ వాసవి కల్యాణ మండపంలో నూతన కార్యవర్గ అధ్యక్షులు బాచిన శివధర పూర్ణ చంద్రరావు, కార్యదర్శి అళహరి హరిప్రసాద్, కోశాధికారి గురుశేఖర్‌తో పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. రొటేరియన్ కాకర్ల వెంకటేశ్వర్లు ఆర్థిక సౌజన్యంతో నాగన్నపాలెం షిరిడి సాయి రిజిస్టర్డ్ సహకార సంస్థకు రూ.25వేల విలువైన కుట్టు మిషన్ అందించారు. తాజా మాజీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య అధ్యక్షత జరిగిన సభలో సహాయ గవర్నర్ రావి అంకమ్మ చౌదరి, డిస్ట్రిక్ట్ సెక్రటరీ కొల్లా సింగారావు, చుండూరి మురళీ సుధాకరరావు, మలాది శ్రీనివాసరావు, వీరవల్లి సుబ్బారావు, షేక్ మహమ్మద్ రఫీ, పంచాగ్నుల ఉదయభాస్కర్, డాక్టర్ చదలవాడ ఫణింద్రబాబు, సందిరెడ్డి శ్రీనివాసరావు, చిన్ని మురళీ కృష్ణ, అద్దంకి లేవి ప్రసాద్, పిఎల్‌వి నరసింహారావు, డాక్టర్ ఉబ్బా దేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, అళహరి సుబ్బారావు, నర్రా శ్రీలక్ష్మి, పి కృష్ణవేణి, కొల్లా భువనేశ్వరి, వై స్నేహలత, ఎ సుధారాణి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొండయ్యకు జ్ఞా.పిక అందజేస్తున్న నాయకులు

సామాజిక సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - వేటపాలెం

సత్యసాయి సేవా సంస్థలు చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని శాసన సభ్యులు కొండయ్య అన్నారు. మండలంలోని రామాపురం సముద్ర తీరంలో సత్య సాయి శత జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. మానవ సేవ ద్వారా పిల్లలు, యువతలో విలువలు పెంచాలని సూచించారు. బాబా 100వ జన్మదినాన్ని రాష్ట్ర ప్రభుత్వం పండుగగా ప్రకటించడం సంతోషకరమైన విషయం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ఆర్ లక్ష్మణరావు, ఉపాధ్యక్షులు సురేంద్ర, జిల్లా అధ్యక్షులు రాంబాబు, న్యాయవాది బండారుపల్లి హేమంత్ కుమార్ పాల్గొన్నారు.



నియామకపత్రం అందుకుంటున్న షేక్ అబ్దుల్ జబ్బర్

న్యాయ అధ్యక్షుడిగా అబ్దుల్‌జబ్బర్

ప్రజాశక్తి - అద్దంకి

పేద ముస్లింలకు న్యాయపరమైన సమస్యలు పరిష్కరిస్తూ అండగా ఉంటున్న షేక్ అబ్దుల్ జబ్బర్‌ను ఉమ్మడి ప్రకాశం జిల్లా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ లీగల్ ప్రెసిడెంట్‌గా రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె రఫీ గుంటూరు అంజుమన్ షాది ఖానాలో జరిగిన కార్యక్రమంలో నియమించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కె మీరస బాబు, ఎండబ్ల్యూఎపి దానికి సంబంధించిన నియామక పత్రం అద్దంకిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తన కార్యాలయం నందు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కె మీరసా బాబు ఆయనకు నియామక పత్రాన్ని అందించారు. రాష్ట్రంలోని పేద ముస్లింలతో పాటు అన్ని కులాలకు సంబంధించిన పేదలకు న్యాయపరమైన సహాయ సహకారాలు ఉచితంగా అందించాలని కోరారు. షేక్ అబ్దుల్ జబ్బర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర స్థాయి బాధ్యత అప్పగించిన ఎండబ్ల్యూఎపి రాష్ట్ర అధ్యక్షులు రఫీ, రాష్ట్ర కార్యదర్శి బాబుకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఒక్క ముస్లింలే కాకుండా అన్నీ వర్గాల పేదలకు న్యాయపరమైన సహాయ, సహకారాలు అందిస్తూ స్థాయిలో లీగల్ సెల్ ఇన్చార్జిలను నియమించుకుని వారి సహాయంతో పేద ప్రజలకు అండగా ఉంటానని అన్నారు. కార్యక్రమంలో షేక్ అహ్మద్, షేక్ ఆఫ్రిది, కరిముల్లా, హుస్సేన్ హజ్రత్, షేక్ రసూల్, షేక్ ఆజాద్ షేక్ రఫీ, షేక్ అక్బర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పురస్కారాలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

భట్టిప్రోలు గ్రామానికి చెందిన ఇరువురు మహిళ ఉపాధ్యాయులకు వ్యాస మహర్షి పురస్కారాలు లభించాయి. వేద వ్యాసుని జయంతి ఆషాడ పూర్ణిమ సందర్భంగా విద్యా బోధన చేస్తూన్న ఉపాధ్యాయులకు వ్యాస మహర్షి పురస్కారాలు ఉపాధ్యాయ సమితి ఆధ్వర్యంలో బాపట్లలో నిర్వహించిన కార్యక్రమంలో ఆదివారం అందజేశారు. ఉపాధ్యాయురాలు, సాధన మండలి అధ్యక్షురాలు బూర్లె అరుణకుమారి, మద్దుల నలిని చంద్ర కిషోర్‌కు అవార్డులు అందించారు. కార్యక్రమంలో అవ్వా రు శ్రీనివాసరావు, డేగల మహేష్, డోగుపర్తి సీతారామయ్య పాల్గొన్నారు.

చెరుకుపల్లి : హిందూ ఉపాధ్యాయ సమితి ఆధ్వర్యంలో వ్యాస మహర్షి విశిష్ట ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పురస్కారాన్ని ఆరేపల్లి ఎంపీ యూపీ పాఠశాల్లో ఉపాధ్యాయ విధులు నిర్వహిస్తున్న మరదాప కోటేశ్వరరావు ఆదివారం అందుకున్నారు. ఆయనను కాటూరి నాగేశ్వరరావు అభినందించారు. బాపట్ల రోటరీ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారం అందజేసి కోటేశ్వరరావు దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో డేగల మహేష్, దొగుపర్తి సీతారామయ్య, స్వర్ణ ఫణి, అజయ్ శర్మ పాల్గొన్నారు.

డీమార్ట్ పేరుతో సైబర్ నేరగాళ్ల దోపిడీ

- ఆఫర్ల పేరుతో ఆశచూపి
- బాధితుడి ఖాతా నుంచి రూ.36వేలు స్వాహా
- పాపాయిపాలెం రాజకీయ నేత వద్ద రూ.5లక్షలు
- క్రెడిట్ కార్డుతో షాపింగ్ చేసిన సైబర్ కేటుగాళ్లు
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలో నివాసం ఉంటున్న ఓ దంపతులకు సైబర్ నెరగాళ్ల ఫోన్ చేసి రివార్డ్ సెంటర్ అనే యాప్ డౌన్లోడ్ చేయమని చెప్పి ఒటిపి అడగకుండానే వారి బ్యాంకు ఖాతాలో రూ.36 నగదు కాజేశారు. దీంతో కంగుతిన్న ఆ దంపతులు దిక్కుతోచని స్థితిలో ఒకటవ పట్టణ పోలీసులను ఆశ్రయించారు. పట్టణంలోని ముంతవారి సెంటర్ యూనియన్ బ్యాంకు సమీపంలో నివాసం ఉంటున్న గ్రంధి సురేష్ దంపతులకు ఈ నెల 1న ఒక నెంబర్ నుండి 2సార్లు ఫోన్ కాల్ వచ్చింది. అయితే వారు పనిలో బడి ఫోన్ లిఫ్ట్ చేయలేదు. తర్వాత తిరిగి అదే నెంబర్‌కు ఆ దంపతులు కాల్ చేశారు. ఫోన్ లిఫ్ట్ చేసి నమస్తే మేడం మేము డిమార్ట్ సెంటర్ నుంచి మాట్లాడుతున్నాం. మీ ఏరియాలో నూతనంగా డీమార్ట్ ప్రారంభించబోతున్నాం. చీరాల బైపాస్ రోడ్డులో నిర్మాణం పనులు గత రెండు నెలలుగా జరుగుతున్నాయి. ఆపై డి మార్ట్ షాపింగ్ అంటే అందరికీ తెలిసిందే కావడంతో నిజమే అనుకున్నారు. అతనితో ఫోనులో సంభాషిస్తుం డగానే ఓ లింకును వారి ఫోనుకు పంపించాడు. దానిని ఓపెన్ చేసి ఇనస్టాల్ చేయమన్నారు. దీంతో యాప్ లింక్ ఓపెన్ చేయగానే ఎలాంటి ఒటిపి సమాచారం చెప్పకుండానే నిమిషాల వ్యవధిలో వారి బ్యాంకు ఖాతాలో నగదు లేనప్పటికీ వారికున్న క్రెడిట్ కార్డు ద్వారా ఆన్లైన్ షాపింగ్ క్షణాల్లో చేసేశాడు. ఒక రియల్ మీ ఫోన్, రెండు సార్లుగా జొమోటోలో ఫుడ్ ఆర్డర్స్ పెట్టి మొత్తం రూ.36 వేల నగదు నొక్కేశాడు. ఆ సమయంలో మెస్సేజ్‌లను గమనించని దంపతులకు క్రెడిట్ కార్డు బిల్లు రావడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో బ్యాంకులో సంప్రదించి కార్డును బ్లాక్ చేయించుకుని దిక్కుతోచని స్థితిలో న్యాయం చేయాలని పోలీసులను అశ్రయించారు.

ఇక ఇదే తరహాలో మరి కొన్ని మోసాలు

చీరాల పట్టణంలో పేరుగాంచిన వైద్యురాలి వద్ద కూడా ఆమె స్నేహితుని వాట్సాప్‌ను హ్యాక్ చాటింగ్ ద్వారా అత్యవసరంగా అమౌంట్ అవసరమని నమ్మించి రూ.1లక్షపైగా నొక్కేశారు. వేటపాలెం మండలం పాపాయిపాలెంకు చెందిన పులి హరికృష్ణ వద్ద రూ.5.70లక్షలు నగదు నొక్కేయటంతో ఆ నేత ఈపురిపాలెం పోలీసులను ఆశ్రయించారు. పట్టణంలోని ఓ ప్రైవేటు షాపింగ్ మాల్లో పనిచేస్తున్న చిరు ఉద్యోగిని వద్ద సైబర్ నేరగాళ్లు ఆన్లైన్ మోసానికి పాల్పడి కొంత నగదు స్వాహా చేశారు.

బ్యాంకు స్టేట్మెంట్ చూపిస్తున్న బాధితుడు సురేష్

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

సైబర్ నేరగాళ్లు వ్యాపార లావాదేవీలు జరిపే వారి ఈ మెయిల్స్ హ్యాక్ చేస్తారు. అన్ సెక్యూర్డ్ ఈ మెయిల్ ఐడీల లావాదేవీలను కొంత కాలం పరిశీలిస్తారు. అదును చూసుకుని నగదు చెల్లించాల్సిన వ్యక్తికి, నగదు తీసుకునే వ్యక్తిలా మెయిల్ పంపిస్తారు. బ్యాంక్ ఖాతా మారిందంటూ తమ ఖాతాను మెయిల్లో పొందుపరుస్తారు. దీంతో చెల్లింపులు నేరగాడి ఖాతాలోకి వస్తాయి. అందుకే ఖాతాలు మారినట్టుగా సమాచారం వస్తే అవతలి వ్యక్తిని నేరుగా సంప్రదించి నిర్ధారించుకున్న తరవాతే డిపాజిట్ చేయడం ఉత్తమం.

అమాయకులకు ఆశ చూపి...

సినిమా హాళ్లు, షాపింగ్ మాల్స్ వంటి చోట్ల ఏదో ఒక సర్వే చేస్తున్నామని నమ్మబలుకుతుంటారు. ఆఫర్ పేరుతో సెల్ఫోన్ నెంబరు రాసి డబ్బాలో వేస్తే డ్రా తీసి బహుమతి ఇస్తామని ఆశ పెడతారు. అలాంటి వారికి వివరాలిస్తే ఇబ్బందే. వారి దగ్గర నుంచి ఈ వివరాలు సైబర్ నేరగాళు కొనేసి నేరానికి పాల్పడే అవకాశం ఉంది.

క్రెడిట్ కార్డుతో జాగ్రత్త

షాపు లేదా పెట్రోల్ బంకుకు వెళ్లి క్రెడిట్ కార్డుతో బిల్లు చెల్లించినపుడు కార్డు చెల్లింపు సమాచారానికి చెందిన ఒక కాపీ వారే ఉంచుకుంటారు. వారి దగ్గర ఉంచుకునే బిల్లు కాపీలో పేరు, కార్డు నెంబరు ఉంటాయి. కార్డు వెనుక ఉన్న సివివి కోడ్‌ను అవతలి వ్యక్తులు నోట్ చేసుకుంటే నెట్లో మీ ఖాతాతో వారు షాపింగ్ చేసుకోవచ్చు. ఒక్కోసారి స్కిమ్మర్లను వినియోగించి కార్డు డేటాను దొంగిలించి, మరో కార్డు తయారు చేసి జల్సా చేస్తున్నారు. ఈ కేసుల్లో నిందితులను పట్టుకోవడం అసాధ్యం. కాబట్టి వీటిపై ప్రభుత్వం ప్రజల్లో అవగాహన కల్పించాలి.

సైబర్ నేరాలపై ఇలా ఫిర్యాదు చేయాలి

సైబర్ దాడులకు గురైనవారు సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ సెల్ సంఖ్య 1930కు ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. బాధితుల పేరు, మెయిలింగ్ అడ్రస్, ఇతర వివరాలు ఫిర్యాదులో పేర్కొనాలి. నేరం ఎలా జరిగిందనే అంశాన్ని పూర్తిగా నమోదు చేయాలి. అత్యవసరమైతే స్థానిక పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలి.

ప్రభుత్వమే న్యాయం చేయాలి

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న నేపథ్యంలో సైబర్ నేరగాల బారిన పడకుండా ఇలాంటి మోస పూరిత యాప్‌లను ప్రభుత్వమే నివారించి నష్టపోయిన బాధితులను ఆదుకోవాలని బాధితుడు గ్రంధి సురేష్ కోరారు. డి మార్ట్ అనగానే నమ్మకంతో యాప్ డౌన్లోడ్ చేశామని, తమ లాగా ఎవరు మోసపోవద్దని అన్నారు. ప్రభుత్వం, పోలీసు అధికారులు ఇలాంటి సైబర్ నేరగాళ్లపై ప్రత్యేక నిఘా పెట్టి అమాయక ప్రజలు మోసపోకుండా చూడాలని కోరారు.

బలహీనతలే సైబర్ నేరగాళ్ల ఆయుధం

డిస్పీ మహ్మద్ మోయిన్

ఆఫర్ల పేరుతో ప్రజలను నమ్మించి సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారని, ఆఫర్లు, డిస్కౌంట్లు వంటి పేర్లతో అపరిచితులు ఫోన్ చేస్తే ఎవరు స్పందించ వద్దని డిఎస్పి మహ్మద్ మొయిన్ చెప్పారు. తెలియని యాప్స్ డౌన్లోడ్ చేయవద్దని అన్నారు. సైబర్ నేరగాళ్ల బారిన పడిన వారు వెంటనే 1930కు ఫోన్ చేసి పిర్యాదు చేయాలని అన్నారు. ప్రస్తుతం ఎలాంటి ఓటీపీలతో పనిలేకుండా యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని ఫోన్లో సంభాషిస్తూనే ఖాతాలో నగదు అపహరిస్తున్నారని అన్నారు. కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మోసపోయిన బాధితులు ఫిర్యాదులు చేయాలని సూచించారు.

హాస్టల్ వార్డెన్ నాగరాజు కన్నుమూత

ప్రజాశక్తి - బాపట్ల



నాగరాజు (ఫైల్)

వెనుకబడిన తరగతుల విద్యార్థుల వసతి గృహ సహాయ సంక్షేమ అధికారి దబ్బ కూటి వెంకట శివ నాగరాజు (డివిఎస్ నాగరాజు) (56) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక బిసి హాస్టల్ వెల్ఫేర్ అధికారిగా ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. వసతి గృహ నిర్వహణలో విద్యార్థులు, అధికారుల నుండి మన్ననలు పొందిన నాగరాజు హఠాన్మరణం పట్ల అధికారులు, ఆయన సహ ఉద్యోగులు, విద్యార్థులు దిగ్భ్రాంతికి గురయ్యారు. పట్టణంలో శ్రీనివాస నగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతి పట్ల అధికారులు, రాజకీయ ప్రముఖులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

నేడు అన్నా క్యాంటీన్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక బౌద్ధ స్తూపం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ప్రభుత్వం నుండి మంజూరైన అన్నా క్యాంటీన్ నిర్మాణానికి శాసన సభ్యులు నక్కా ఆనందబాబు సోమవారం శంకుస్థాపన చేయనున్నట్లు టిడిపి మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు వాకా శేషుబాబు, నూతక్కి దినకర బాబు, టిడిపి ప్రధాన కార్యదర్శి గుట్టుముక్కల లెనిన్ తెలిపారు. తమ ప్రభుత్వం నిరుపేదలకు రూ.5లకే భోజనం అందించాలనే దృక్పథంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలో రిక్షా, ఆటో కార్మికులతో పాటు భవన్ నిర్మాణ కార్మికులు, ఇతర రంగాల్లో పనిచేసే కార్మికులు, పేదలకు ఈ క్యాంటీన్ ఎంతో దోహద పడుతుందని అన్నారు. అనంతరం ఐలవరంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఏలూరి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక వైఆర్ హైస్కూల్లో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరంకు ప్రజలు తరలి వచ్చారు. నోవా అగ్రి గ్రూప్, ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. వైద్య శిబిరానికి 813 మంది హాజరు కాగా 350 మందిని శస్త్ర చికిత్సకు రిఫర్ చేశారు. మహిళలు, పురుషులకు వేరువేరుగా ప్రత్యేక షామియానాలు ఏర్పాటు చేశారు. తాగునీరు, భోజన సదుపాయం కల్పించారు. టిడిపి మండల అధ్యక్షుడు షేక్ శంషుద్దీన్, టిడిపి లీగల్ సెల్ అధ్యక్షులు కొల్లా నరేంద్ర కుమార్, రాజా మాట్లాడారు. లక్ష మందికి కంటి వైద్య శస్త్ర చికిత్సలే లక్ష్యంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఉచిత మెగా కంటి వైద్య శిబిరాలు ప్రారంభించారని అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల కోసం సేవా కార్యక్రమాలు చేస్తూ సాంబశివరావు ప్రజలకు చేరువయ్యాడని కొనియాడారు. కార్యక్రమంలో నాగుల పాలెం సర్పంచ్ దాసి సుధారాణి కిరణ్, ఉప సర్పంచ్ రాముడు, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, శేఖర్ బాబు, కారుమంచి కృష్ణ, షేక్ హుస్సేన్, కాపు రవిచంద్ర, కోరిటాల సురేష్, కుల్ల శ్రీనివాసరావు, కొల్లారామయ్య, కృష్ణ, అప్పలనేని నరేంద్ర, వెంకట్, శ్రీరామ్ సుబ్బారావు, శ్రీధర్, ఆంజనేయులు, కృష్ణ, ఖాజావలి, నాగులపాలెం టిడిపి అధ్యక్షులు సురేష్ కృష్ణ పాల్గొన్నారు.

వైద్య శిబిరం ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

బ్రిడ్జిపై నుంచి పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - మెదరమెట్ల

మండలంలోని తిమ్మనపాలెం నుండి కోరిసపాడు వెళ్తూ మెదరమెట్ల తమ్మవరం రోడ్డు వద్ద ఓవర్ బ్రిడ్జిపై ద్విచక్రంపై అతి వేగంగా వెళుతూ అదుపుతప్పి కింద పడటంతో యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. మృతుడు కోరిశపాడుకు చెందిన పాలేటి రాకేష్ (22)గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మేదరమెట్ల ఎస్ఐ మహమ్మద్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడు రాజేష్

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న అనగాని శివప్రసాద్

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - నగరం

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో స్థానిక వెలగపూడి రామకృష్ణ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి భారీ స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 10 మంది అనుభవజ్ఞులైన డాక్టర్లతో పాటు 220 మంది వైద్య సిబ్బంది సేవలందించారు. శిబిరాన్ని మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ సందర్శించి వైద్య బృందానికి అభినందనలు తెలిపారు. శిబిరంలో కళాశాల కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్య చౌదరి, కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎన్‌వికె ప్రసాద్, షేక్ మునాఫ్, లుక్క గుడారంకయ్య, రమేష్ హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

కౌతరపు శ్రీనివాసరావును అభినందిస్తున్న నాయకులు

వైసిపి ఆర్‌టిఐ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వైసిపి ఆర్టిఐ మండల అధ్యక్షునిగా భట్టిప్రోలుకు చెందిన కౌతరపు శ్రీనివాసరావును (పాల శీను) నియమిస్తూ వైసిపి అధిష్టానం నుండి ఆదేశాలు అందాయి. ఆయన నివాసంలో వైసిపి మండల కన్వీనర్ పడమట శ్రీనివాసరావు అభినందించారు. ఆర్టిఐ అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఉంచిన ఈ పదవికి న్యాయం చేసి వైసిపి అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన పడమట శ్రీనివాసరావు, వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

సదస్సును ప్రారంభిస్తున్న ఐటి అధికారులు

జిఎస్‌టిపై అవగాహన

ప్రజాశక్తి - చీరాల

ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఎఐ) ఎస్ఐఆర్‌సి ఒంగోలు బ్రాంచి, చీరాల చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌వీఎస్ అండ్ ఎస్‌జెఆర్ ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో ఆదాయపు పన్ను బిల్లు, జిఎస్టీపై అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. వ్యాపారవేత్తలు, నిపుణులు, పన్ను చెల్లింపు దారులకు ఐటి అధికారి గ్రంధి మురళీ కృష్ణ, జిఎస్టీ రాష్ట్ర అసిస్టెంట్ కమిషనర్ రాయవరపు శ్రీనివాసరావు, సెంట్రల్ జిఎస్టీ సూపరింటెండెంట్ చింతలపల్లి వెంకట సుబ్రహ్మణ్యం అవగాహన కల్పించారు. ఒంగోలు బ్రాంచ్ చైర్మన్ సిఎ చక్కా తిరువాయి కుమార్ ఆదాయపు పన్ను బిల్లు ముఖ్యాంశాలు వివరించారు. సిఎ సుధీర్, విఎస్ సిఎ మద్ది రాజేష్ జిఎస్టీ అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా 75 ఏళ్లు పైబడి సేవలందిస్తున్న సీనియర్ సిఎలను సత్కరించారు. సదస్సు ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా సిఎ వల్లంపట్ల వెంకటేశ్వరరావు నిర్వహించారు. కార్యక్రమంలో చాంబర్ కార్యదర్శి చిన్ని లీలాధరరావు, ఎంజిసి అధ్యక్షుడు వేముల చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

16న జాబ్ మేళా

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 15న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె. రమాదేవి ఆదివారం ఓ ప్రకటన లో తెలిపారు. ఈ జాబ్ మేళాలో బిఎఫ్ఐఎల్, విజన్ ఇండియా సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్, ఈనాడు టిఐఇ ఎల్ లాంటి సంస్థలు పాల్గొంటున్నాయన్నారు. బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, తయారీ, లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్, మార్కెటింగ్ సెక్టార్ విభాగాలలో ఖాళీలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. టెన్త్, ఐటిఐ, ఇంటర్మీడియేట్, డిప్లొమా లేదా ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12,000 నుంచి రూ.28,000 జీతం ఇస్తారని తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు ఆధార్ కార్డు, విద్యాసర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు తమ వెంట తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు ఎంప్లాయిమెంట్ వెబ్ సైట్ లేదా కార్యాలయ సమయాల్లో 08592-281776 నంబర్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లా పరిధిలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అశాకాన్ని సదినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సమస్యలు పరిష్కరించాలని

మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల శనివారం అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి దిగారు. అందులో భాగంగా వాటర్ ఫిల్టర్ బెల్ట్ ట్యాంక్ వద్ద ఆదివారం నిరసన తెలిపారు. వాటర్ లైన్ మాన్, పార్కులు, బోరింగ్ రిపేర్, మొక్కల సంరక్షణ, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కార్యదర్శి టి.మహేష్ మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా కార్మికులకు వేతనాలు సక్రమంగా ఇవ్వలేదన్నారు. జీవో నంబర్ 36 ప్రకారం, స్కిల్ వర్గీకరణ ప్రకారం జీతాలు చెల్లించకపోవడం వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.గతంలో సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం కూడా సమస్యలను పరిష్కరించలేదని విమర్శించారు. ఇంజినీరింగ్ కార్మికుల కష్టాలను ప్రభుత్వం విస్మరించడం దారుణమన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నగర నాయకులు టి. విజయమ్మ, కె. వెంకట్రావు, జాలయ్య, మోహన్ రామారావు, సుధాకర్, ప్రసన్న, సింగయ్య, వెంకటస్వామి, శ్రీదేవి, లక్ష్మీ ప్రసన్న, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురంలో సమ్మె చేస్తున్న కార్మికులు

మార్కాపురం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని, వేతనాల పెంపు లాంటి హామీలు ఇచ్చి, తీరా అధికారంలోకి వచ్చిన తరువాత హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకపోవడంతో కార్మికులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితిలో సమ్మె బాట పట్టారు. మార్కాపురం మున్సిపాలిటీలోని ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు ఆదివారం నుంచి సమ్మెలోకి వెళ్లారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం రఫీ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులు తక్కువ వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. పెరిగిన ధరలకు వేతనాలు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. కార్మిక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయన్నారు. విద్యార్థుల చదువులకు సైతం ప్రభుత్వ ఉద్యోగిగా చూపిస్తూ సంక్షేమ పథకాలు అందించకపోవడంతో చదువుల భారం కూడా మరింత పెరిగిందన్నారు. తల్లికి వందనం కూడా వర్తించడం లేదన్నారు. ఇతర సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. జీవో నెంబర్ 36 అమలు చేయాలని కోరారు. ఇంజినీరింగ్ కార్మికులందరికీ నెలవారీ వేతనం రూ.21 వేలు చెల్లించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. స్కిల్డ్, అన్‌స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుడు మరణిస్తే అదే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కె.సుబ్బరాయుడు, గొట్టం హరికృష్ణ, ఆర్.శేఖర్‌రెడ్డి, షేక్ రషీద్‌బాషా, పి.సలాంఖాన్, ఎవి. రమణ, ఇ.కనకయ్య, ధనంకుల చిన్నరాయుడు, కె.అనంతర సింగ్, గంజేరుపల్లి అల్లూరయ్య, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో నిరసన తెలుపుతున్న కార్మికులు

నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

పంచాయతీ రాజ్ విశ్రాంత ఉద్యోగులు

ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్, గ్రామీణాభివద్ధి మరియు ఇంజినీరింగ్ విభాగాల్లో ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగుల సంక్షేమం కోసం అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు టి.ఎమ్ బాబ్బిరాజు ఆదేశాల మేరకు ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బూదే రామరాజ్ కుమార్, కార్యదర్శిగా పి.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడిగా ఎంవి. మురళీమోహన్‌ను నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో డి. రామకష్ణారెడ్డి, వి. సాయికీర్తి, ఈదర విజయలక్ష్మి, అమ్మణి, భీమశ్వరరావు, మాలకొండయ్య, షేక్ మసీర్ మహబూబ్, లతీఫ్ బాబు, వసంత కుమార్ పాల్గొన్నారు.

పేద విద్యార్థుల చదువుకు సహకారం

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

పేద విద్యార్థుల చదువుకు ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తు ందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు పేర్కొన్నారు. ఒంగోలు కవర్తపు ఆదిలక్ష్మమ్మ, మార్కండేయ ఎడ్యుకేషనల్ సొసైటీ 12వ వార్షికోత్సవం శ్రీ షిర్డి సాయి కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. తొలుత ప్రముఖ పారిశ్రామిక వేత్త స్వర్గీయ కవర్తపు శ్రీనివాసరావు చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు సొసైటీ అధ్యక్షుడు కవర్తపు బాలకృష్ణారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదరికంతో ఎవరూ విద్యకు దూరం కాకూడదని, అందుకోసం తాము స్థాపించిన డిజెఆర్ ట్రస్టు ద్వారా కొంత మందిని చదివిస్తున్నామన్నారు. సంస్థ స్థాపకులు స్వర్గీయ కవర్తపు శ్రీనివాసరావు సామాజిక సేవా దృక్పథం కలిగిన వ్యక్తి అని కొనియాడారు. అనంతరం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పదో తరగతిలో 600/592 మార్కులు సాధించిన ఊట్ల హిమబిందు, ఇంటర్మీడియట్‌లో 1000/991 మార్కులు సాధించిన కొడవలి హేమలతకు ఎమ్మెల్యే ప్రతిభా పురస్కారాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి గుంటి మోహనరావు, కవర్తపు వెంకట ప్రసాదరావు, జంజనం శ్రీనివాసరావు, అవ్వారు ముసలయ్య, గుద్దంటి లక్ష్మినారాయణ, కవర్తపు రామమోహన్, డాక్టర్ అవినాష్, బండి రామకృష్ణ, జట్ల మురళి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'సూర్యఘర్'తో ప్రయోజనం

- ఇంధన పొదుపుపై ప్రచారం
- నింతర విద్యుత్ సరఫరా కోసం కృషి
- బాపట్ల జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఇ జి. ఆంజనేయులు

ముఖాముఖి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

సూర్యఘర్ యోజన పథకాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకొని విద్యుత్ బిల్లు తగ్గించుకోవాలని బాపట్ల జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఇ జి. ఆంజనేయులు తెలిపారు. సూర్యఘర్ యోజన పథకం ద్వారా విద్యుత్ ఆదాతో పాటు లబ్ధిదారులకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుందన్నారు. పథకం గురించి విస్తృతంగా అవగాహన కల్పించి ఎక్కువ మంది దరఖాస్తులు చేసుకునే చర్యలు చేపట్టామన్నారు. విద్యుత్ పొదుపు,సూర్యఘర్ రిజిస్ట్రేషన్‌పై ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.

దిగువ, మధ్య తరగతి వినియోగదారుల కోసం ఈ పథకాన్ని 2024 ఫిబ్రవరి 13న ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 2 కిలో వాట్స్ చొప్పున ఉచితంగా సోలార్ సిస్టం ఏర్పాటు చేస్తార న్నారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో 10 వేల కుటుంబాలకు సోలార్ సిస్టం ఏర్పాటు లక్ష్యమన్నారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో 60 వేల కుటుంబాలకు సోలార్ సిస్టం ఏర్పాటుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. లక్ష్యాలను చేరుకోవడానికి స్వయం సహాయక గ్రూపు సభ్యుల కుటుంబాలకు సోలార్ సిస్టం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి ఇంటికి 3 కిలో వాట్ సోలార్ ప్లేట్లు అమర్చేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సోలార్ ప్లేట్లకు మొత్తం రూ.2.10 లక్షల ఖర్చు అవుతుందన్నారు. అందులో రూ. 78 వేలు సబ్సిడీగా వస్తుందన్నారు. లబ్ధిదారుడి వాటాగా రూ.20 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. బ్యాంకర్లు రూ.1.02 లక్షలు రుణంగా ఇస్తారని తెలిపారు. ఈ పథకానికి సంబంధించి ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రారంభించినట్లు తెలిపారు. పథకం నాలుగేళ్లపాటు అందుబాటులో ఉంటుం దన్నారు. ఇంటిపై ఏర్పాటు చేసుకునే సోలార్ సిస్టమ్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తులో మొదటి 300 యూనిట్లు లబ్ధిదారుడు ఉచితంగా వినియోగించు కోచ్చునని తెలిపారు. సూర్యఘర్ కోసం రిజిస్టర్ చేసుకున్న లబ్ధిదారులకు సోలార్ పలకాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామాన్ని విద్యుత్ సిబ్బంది, సోలార్ కాంట్రాక్టర్స్ సందర్శించి వినియోగదారులకు ఈ పథకం గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో సూర్యఘర్ యోజన పథకం అమలు కోసం నోడల్ అధికారిని ప్రత్యేకంగా నియమించినట్లు తెలిపారు.

ఇంధన పొదుపు ఆవశ్యకతపై ప్రచారం

ఇంధన పొదుపు ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన పెంపొందించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అవసరం ఉన్న మేరకు మాత్రమే విద్యుత్‌ను వినియోగించాలన్నారు. ఎల్ఈడీ బల్బుల వినియోగం వల్ల విద్యుత్ ఆదా అవుతుందన్నారు. అందుకే ఎన్ఈడీ బల్బుల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. గృహాల్లో వీలైనంత వరకు విద్యుత్‌ను ఆదా చేసే స్టార్ రేటెడ్ ఉపకరణాలను ఉపయోగించాలన్నారు. భవిష్యత్ తరాల కోసం, భావితరాల భద్రత కోసం ఇంధనాన్ని పొదుపుగా వినియోగించు కోవాలన్నారు. ఫ్యాన్లు, ఫ్రిజ్, టీవీ, కంప్యూటర్లు, ఏసీలు, ఓవెన్లు, ఎలక్ట్రిక్ కుక్కర్ వినియోగం వల్ల విద్యుత్ బిల్లులు అధికంగా వస్తాయని తెలిపారు. ఈ పరికరాలను వినియోగించేప్పుడు పొదుపు చిట్కాలను పాటించాలన్నారు. పగటిపూట వీలైనంత మేర విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. రాత్రి సమయంలో సాధ్యమైనంత త్వరలో దినచర్యలను ముగించుకుని విద్యుత్ వినియోగాన్ని తగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అవసరం లేన్నప్పుడు లైట్లు, ఫ్యాన్లల తప్పనిసరిగా ఆపివేయాలన్నారు. విద్యుత్‌ను పొదుపు చేయడమంటే మన ధనాన్ని ఆదా చేసుకోవడమేనని విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరా కోసం కృషి

అంతరాయం లేకుండా మెరుగైన విద్యుత్ సరఫరా కోసం కృషి చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఇ ఆంజనేయులు తెలిపారు. మేలైన విద్యుత్ సరఫరా కోసం నూతన ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్స్, విద్యుత్ లైన్ల పనులు చేపట్టినట్లు తెలిపారు. వ్యవసాయ ఫీడర్లకు ప్రత్యేక లైన్లు వేసే చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎల్‌టి ఫీడర్ల నుంచి వ్యవసాయ ఫీడర్లను వేరు చేసే పనులు ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో 104 సబ్‌స్టేషన్ల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతున్నట్లు తెలిపారు. జిల్లా 4.93 లక్షల సాధారణ విద్యుత్ సర్వీసులు, 47,725 కమర్షియల్ సర్వీసులు, పరిశ్రమలకు సంబంధించిన సర్వీసులు 1,934, మందిరాలు, మసీదులు, చర్చిలకు సంబంధించి 9,266 సర్వీసులు ఉన్నట్లు తెలిపారు. ఆక్వా పరిశ్రమలో 3,264 సర్వీసులు, వ్యవసాయ రంగంలో 37,627 సర్వీసులు ఉన్నట్లు తెలిపారు. వ్యవసాయ,ఆక్వా రంగాలకు విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.